ప్రతిపక్షం

www.prathipaksham.in

బుధవారం 11.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 322 పేజీలు:9 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

పాకిస్తాన్ యూటర్న్.. ఇండియాతో మ్యాచ్‌కు ఓకే! 9

సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో పోలింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావిణ్య

మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం

116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో నేడు పోలింగ్

- ఓటు హక్కును వినియోగించుకోనున్న 52,17,413 మంది
- 2,981 వార్డులకు గాను బరిలో 12,944 మంది అభ్యర్థులు
- ఎన్నికల కోసం 8,203 పోలింగ్ కేంద్రాలు సిద్ధం
- రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- 13న తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 10: తెలంగాణలో పురపాలక ఎన్నికల పోరుకు రంగం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో నేడు పోలింగ్ జరగనుండగా, ఇందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ ఎన్నికల్లో మొత్తం 52,17,413 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరి కోసం 8,191 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రక్రియ బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు

...:: మిగతా 2లో

ఫోన్ ట్యాపింగ్ ఇంకా జరుగుతోంది

బీఆర్ఎస్ వద్ద ఇంకా ట్యాపింగ్ పరికరాలు ఉన్నాయి

- వారు మా మాటలు వింటున్నారని అనుమానం
- కార్పొరేటర్లతో నేను ఏం మాట్లాడానో విన్నారు
- ఎక్కడెక్కడ పరికరాలు పెట్టారు?
- ఎవరు సూత్రధారులు? అనేది బయటకు తీస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 10: ఫోన్ ట్యాపింగ్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ వద్ద ఇంకా ఫోన్ ట్యాపింగ్ పరికరాలు ఉన్నాయని, ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ జరుగుతూనే ఉందని అన్నారు. మంగళవారం ఆయన ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ చేస్తూ మా మాటలు వింటున్నారని అనుమానంగా ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్ పరికరాలు వారి దగ్గర ఉన్నాయని అనిపిస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మా ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని, ఫోన్‌ట్యాపింగ్‌ఎక్విప్మెంట్ బయటపెడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. కార్పొరేటర్లతో నిర్వహించిన కాన్ఫరెన్స్ కాల్‌లో నేను ఏం మాట్లాడానో ట్యాపింగ్ చేసి విన్నారని, ఫోన్ ట్యాపింగ్ కేసును ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని ఆయన అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేస్తున్న వాళ్లపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వంలో ఉన్న మా సమాచారం బయటికి ఎలా పోతుందా అనే అనుమానం ఉండేదని, మేము మాట్లాడుకుంటున్న కాన్ఫరెన్స్ కాల్స్ వింటున్నారని.. అవి బయటకు ఎలా లీక్ అవుతున్నాయి.? అని ప్రశ్నించారు. 'ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్నది వాస్తవం.. పెద్దల నుండి సామాన్యుల వరకు ఎవ్వరిని వదలకుండా ఫోన్ ట్యాపింగ్ చేశారని వచ్చిన ఆరోపణలు నిజమనే తెలుస్తుంది. ఇప్పుడు కూడా ఆ ఎక్విప్మెంట్

...:: మిగతా 2లో

నేను ఎవ్వరికీ దత్తపుత్రుడిని కాదు

- మా తల్లి పెట్టిన పేరు మార్చడానికి మీరెవరు
- మీరు రేవంత్ ఖాన్ అని మార్చుకోండి
- కేసీఆర్‌ను అరెస్ట్ చేస్తే కేంద్ర ప్రభుత్వం అడ్డురాకుండా చూసే బాధ్యత తనదని
- సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 10: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తన పేరును మార్చి పిలుస్తున్నారని ఫైర్ అయ్యారు. 'మీరు రేవంత్ ఖాన్ అని మార్చుకోండి.. మాకు అభ్యంతరం లేదు. కానీ.. మా తల్లి

...:: మిగతా 2లో

ఒవైసీ బ్రదర్స్ అధికారం చుట్టూ తిరిగే సన్ ఫ్లవర్స్

గతంలో తెలంగాణను వ్యతిరేకించారు.. రాయల తెలంగాణ అని అన్నారు

- కేసీఆర్ తో అధికారంలో పంచుకున్నారు
- రాహుల్ గాంధీ ఓవైసీ బ్రదర్స్ ను వ్యతిరేకిస్తారు
- ఇక్కడ ముఖ్యమంత్రి వారితో దోస్తానా చేస్తారు
- బడ్జెట్‌లో హామీల అమలు చేయాలి
- 1.89 లక్షల ఉద్యోగాలకు నిధులు ఇవ్వాలి
- బీసీలకు రూ.20 వేల కోట్లు కేటాయించాలి
- 12న జరిగే సార్వత్రిక సమ్మెకు మద్దతు
- అదే రోజు జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 10: 'ఒవైసీ బ్రదర్స్ అధికారం చుట్టు తిరిగే సన్ ఫ్లవర్స్. గతంలో రాయల తెలంగాణ అని తెలంగాణను వ్యతిరేకించారు. కానీ తెలంగాణ వచ్చాక కేసీఆర్ తో కలిసి అధికారంలో పాలు పంచుకున్నారు. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ తో జత కట్టారు. రాహుల్ గాంధీ కేంద్రంలో ఓవైసీ బ్రదర్స్ ను వ్యతిరేకిస్తారు. కానీ ఇక్కడ ముఖ్యమంత్రి మాత్రం వారితో దోస్తానా చేస్తారు.' అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని

...:: మిగతా 2లో

ఏపీ నీళ్ల దోపిడీ

- కాంగ్రెస్–బీజేపీ మౌన సహకారం
- 664 టీఎంసీలు తరలించిన ఏపీ
- చేతులు ముడుచుకుని కూర్చున్న సీఎం
- తెలంగాణ హక్కులను కాలరాస్తున్న రేవంత్ ప్రభుత్వం
- కృష్ణా జలాల దోపిడీని అడ్డుకోలేని రేవంత్ ప్రభుత్వం
- మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 10: కృష్ణా నదీ జలాలను ఆంధ్రప్రదేశ్ అక్రమంగా, అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా తరలించుకుపోతుంటే తెలంగాణ ప్రభుత్వం చేతులు ముడుచుకుని కూర్చుందంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, ఈ వాటర్ ఇయర్‌లో జనవరి 29, 2026 నాటికి ఏపీ ఇప్పటికే 664 టీఎంసీల నీటిని వినియోగించుకుందని, ఇది తాత్కాలిక

...:: మిగతా 2లో

పార్టీ ఫండ్ పంపిణీలో భారీ మాయాజాలం

- కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల్లో కలకలం
- ఒక్కో అభ్యర్థికి ఇచ్చిన 15 లక్షల్లో కోతలు!
- డబ్బు కట్టల్లో షాకింగ్ షార్టేజీ
- ఇంచార్జ్ - పీఆర్వోలపైనే అనుమానాలు..

...:: 3లో

మక్తల్‌లో బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య

- వేధింపులే ఈ ఘటనకు కారణం: టీబీజేపీ చీఫ్
- తమ సహనాన్ని పిరికితనంగా భావిస్తారా?:
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసే రోజులొచ్చాయి: బండి సంజయ్
- ఎన్నిక రద్దు చేసిన అధికారులు
- డీజీపీ కార్యాలయం ముట్టడిలో ఉద్రిక్తత
- కిందపడ్డ డీసీసీ శిల్పవల్లి
- పోలీసులకు, నేతలకు గాయాలు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్

ఫిబ్రవరి 10 : నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ కేంద్రంలో మున్సిపాలిటీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో 6వ వార్డు చందపూరులో బీజేపీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్యకు పాల్పడ్డారు. 6వ వార్డు నుంచి గెలుపొందేందుకు మహదేవప్పకు ఎక్కువ అవకాశాలుండటంతో ఇతర పార్టీ నాయకులు బెదిరింపులకు గురి చేయడంతో భయబ్రాంతులకు లోనై ఉరి వేసుకొని మృతి చెందినట్లు బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. కాగా, నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో బీజేపీ అభ్యర్థి మృతి కారణంగా ఆరో వార్డు

...:: మిగతా 2లో

స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం

- 118 మంది ఎంపీల సంతకాలతో నోటీసు
- రూల్ 94సీ కింద నోటీసు ఇచ్చా: కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్



ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను పదవి నుంచి తొలగించాలంటూ కాంగ్రెస్ పార్టీ అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు కాంగ్రెస్ ఎంపీలు నోటీసులు అందించారు. కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ తదితర పార్టీలకు చెందిన 118 మంది ఎంపీలు నోటీసులపై సంతకాలు చేసినట్లు పార్టీ వర్గాలు చెప్పాయి. కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ మీడియాతో మాట్లాడుతూ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 94C ప్రకారం స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే హక్కు ఉందని చెప్పారు. "ఈరోజు

...:: మిగతా 2లో



నరవణే అబద్ధం చెప్పరని నేను నమ్ముతున్నాను

తాము ఆ పుస్తకాన్ని రిలీజ్ చేయలేదని పెంగ్విన్ సంస్థ చెబుతోంది. కానీ రాహుల్ మాత్రం అమెజాన్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే పెంగ్విన్ కన్నా మాజీ ఆర్మీ చీఫ్ వ్యాఖ్యలను నమ్ముతున్నట్లు రాహుల్ తెలిపారు.

8

సంస్కృతి, ప్రగతికి చిహ్నం 'బస్తర్'

ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోటగా ఉన్న బస్తర్, ఇప్పుడు గొప్ప సంస్కృతి, ప్రగతి, ఆత్మవిశ్వాసానికి చిహ్నంగా మారిందని ప్రధాని మోదీ అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన 'బస్తర్ పండమ్" పండుగపై ఆయన ప్రశంసలు కురిపించారు.

8

ఫ్రాన్స్ అధ్యక్షుడి భారత పర్యటన ఖరారు

ఎన్సీపీ-ఎస్పీ అధినేత శరద్ పవార్ అస్వస్థతకు గురయ్యారు. గత కొన్ని రోజులుగా ఆయన గొంతునొప్పి, దగ్గుతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే కుటుంబ సభ్యులు ఆయన్ను పుణెలోని రూబీ ఆస్పత్రికి తరలించారు.

8

ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బుల పంపిణీ

రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఓటుకు 10,000 వరకు డబ్బులు పంచుతున్నట్లు పలు పత్రికలలో తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్‌కేశవులు అన్నారు.

8

రాజకీయం

ఫోన్ ట్యాపింగ్ ఇంకా జరుగుతోంది

మొదటిపేజీ తరువాయి

వాడుకుంటున్నరు కాబట్టే..మేము అధికారులతో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన విషయాలు కూడ బయటికి వస్తున్నాయన్నది అనుమానంగా ఉంది. దీనిపై ప్రభుత్వం సీరియస్ గా ఎంక్వయిరీ చేస్తోంది. ఎవరు సూత్రధారులు? ఎక్కడెక్కడ పరికరాలు పెట్టారు? అనేది బయటకు తీస్తాం.' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.

80 శాతం స్థానాలను కైవసం చేసుకుంటాం

రాష్ట్రంలో రేపు జరగనున్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. గత కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల ముందుంచే ప్రయత్నం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నేడు జరగనున్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 80 శాతం స్థానాలను కైవసం చేసుకుంటుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. గడిచిన రెండేళ్లలో ఇచ్చిన ప్రతి మాటను నెరవేర్చామని, అందుకే ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులను దీవించబోతున్నారని ఆయన పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని 8 లక్షల 19 వేల కోట్ల అప్పుల్లో ముంచిందని పొంగులేటి విమర్శించారు. ప్రస్తుతం నెలకు 6,300 కోట్ల రూపాయలు కేవలం అప్పుల జమకే కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమం కుంటుపడకుండా చూస్తున్నామన్నారు. వరి వేస్తే ఉరి అనిన కాలం పోయి, నేడు మద్దతు ధరతో పాటు బోనస్ ఇస్తున్నామని గుర్తుచేశారు. విద్యార్థుల కోసం డైట్, కాస్మెటిక్ ఛార్జీల పెంపుతో పాటు ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. 'గత పాలనలో దొరలు బొమ్మలు చూపించారు తప్ప ఇళ్లు ఇవ్వలేదు' అని విమర్శిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే పార్టీలకు అతీతంగా 4.5 లక్షల ఇళ్లు మంజూరు చేసిందని మంత్రి పొంగులేటి చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని, పట్టణాల్లో ఇళ్ల స్థలాలు లేని పేదల కోసం G+3 ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. ప్రతిపక్ష నేతలు అసభ్య పదజాలంతో హీనంగా మాట్లాడుతున్నారని, వారికి ఈ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని పొంగులేటి మండిపడ్డారు. తాను సీఎం రేసులో లేనని, కేవలం కాంగ్రెస్ పార్టీలో ఒక సామాన్య కార్యకర్తను మాత్రమేనని పొంగులేటి స్పష్టం చేశారు.

నేను ఎవ్వరికీ దత్తపుత్రుడిని కాదు

మొదటిపేజీ తరువాయి

పెట్టిన పేరు మార్చడానికి మీరెవరు? మాపై వ్యక్తిగత విమర్శలు సరికాదు. మీకు దెయ్యాలు.. దేవతల్లా కనపడవచ్చు. మజ్లిస్‌తో మీరు కాపురం చేసినన్నాళ్లూ.. మేం నిప్పులు పోస్తాం' అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో అన్ని స్థానాల్లో ఎంఐఎం ఎందుకు పోటీ చేయలేదని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. తాను ఎవ్వరికీ దత్తపుత్రుడ్ని కాదని ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మధ్య ఏవైనా విభేదాలుంటే వారే తేల్చుకోవాలని, తనను మధ్యలో లాగడం ఎందుకని ప్రశ్నించారు. తన గురించి తప్పుగా మాట్లాడటం సరికాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి.. కేసీఆర్‌ను అరెస్ట్ చేయకుండా కిషన్ రెడ్డి పేరు మారుస్తానని అంటున్నారని కేంద్ర మంత్రి మండిపడ్డారు. కేసీఆర్‌ను అరెస్ట్ చేస్తే కేంద్ర ప్రభుత్వం అడ్డురాకుండా చూసే బాధ్యత తనదని స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక గాంధీ.. ఒక్క రోజూ కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడలేదని విమర్శించారు. తామెప్పుడూ బీఆర్ఎస్‌తో కలవలేదని తేల్చిచెప్పారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి పోటీ చేశాయని గుర్తుచేశారు. ఇప్పుడేమీ చేయలేక తనపై ఆడి పోసుకుంటున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిదా? కిషన్ రెడ్డిదా.? అనేది తెలంగాణ సమాజం ఆలోచించాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తలాతోకా లేకుండా రేవంత్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉంటూ రెండేళ్లుగా మాటలతో కాలయాపన చేశారని..ఏం చేస్తారో చేతల్లో చూపించాలన్నారు. ఇచ్చిన మాటపై నిలబడే శక్తిలేకపోతే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మక్తల్ బీజేపీ అభ్యర్థి మహదేవప్ప మృతికి సీఎం రేవంత్ బాధ్యత వహించాలన్నారు. ఎన్నికల సంఘం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి కోరారు.

మక్తల్‌లో బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి

ఎన్నిక రద్దు చేసినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

బెదిరింపులు, వేధింపులే కారణం

మృతిచెందిన మహాదేవప్ప కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు పరామర్శించారు. మహాదేవప్ప ఆత్మహత్య ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తమ అభ్యర్థి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల బెదిరింపులు, వేధింపులే ఈ ఘటనకు కారణమని ఆరోపించారు. మహాదేవప్పది ఆత్మహత్య కాదు, కాంగ్రెస్ చేసిన హత్య అని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ నాయకులు బెదిరింపులు, అరాచకాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. తమ సహనాన్ని పిరికితనంగా భావిస్తారా? అని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల తరువాత కాంగ్రెస్‌పై యుద్ధం చేయబోతున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసే రోజులొచ్చాయని ధ్వజమెత్తారు. కార్యకర్తలారా ధైర్యంగా ఉండండి, నాయకత్వం అండగా ఉందని తెలిపారు. మహదేవప్ప ఆత్మహత్యకు కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ డీకే అరుణ మహదేవప్ప కుటుంబసభ్యులను పరామర్శించారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. మహదేవప్ప ఆత్మహత్య ఘటనను రాజ్యసభలో ప్రస్తావించినట్లు ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. కాంగ్రెస్ ఒత్తిడితో ఎస్టీ అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడం దారుణమని అన్నారు. ఈ ఘటనను కేంద్రప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహదేవప్ప ఆత్మహత్యపై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని అన్నారు.

హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయం వద్ద ఆందోళన

మక్తల్‌లో బీజేపీ అభ్యర్థి ఆత్మహత్యకు కాంగ్రెస్ కారణమంటూ బీజేపీ నాయకులు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. కార్యాలయం లోపలికి వెళ్లేందుకు యత్నించిన నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీజేపీ శ్రేణులకు మధ్య తోపులాట, వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ తోపులాటలో ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి కిందపడిపోయారు. పలువురు పోలీసులు, బీజేపీ కార్యకర్తలకు గాయాలు అయ్యాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. మక్తల్ బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు వచ్చిందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. మహదేవప్ప ఎటువంటి ఆత్మహత్య లేఖ రాయలేదని తెలిసిందని చెప్పారు.

స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం

మొదటిపేజీ తరువాయి

మధ్యాహ్నం 1:14 గంటలకు స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసు సమర్పించాం. మొత్తం 118 మందికి పైగా ఎంపీలు దీనిపై సంతకాలు చేశారు. సభలో ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశమే ఇవ్వడం లేదు. ప్రజా సమస్యలు లేవనెత్తే హక్కును పదేపదే నిరాకరిస్తున్నారు" అని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాల ఆరోపణల ప్రకారం, ఇటీవల జరిగిన పలు సంఘటనలు ఈ నిర్ణయానికి దారితీశాయి. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వలేదని వారు పేర్కొన్నారు. చైనా సరిహద్దు ఉద్రిక్తతలపై జనరల్ నరవణే స్మృతులను ప్రస్తావించేందుకు రాహుల్ ప్రయత్నించినప్పటికీ, స్పీకర్ అనుమతించలేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

స్పీకర్ ఓం బిర్లా చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం

అదేవిధంగా, ఎనిమిది మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం కూడా పెద్ద వివాదంగా మారింది. తమ రాజ్యాంగ హక్కులను వినియోగించినందుకే ఈ చర్యలు తీసుకున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. మాజీ ప్రధానమంత్రులపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబేపై చర్యలు తీసుకోకపోవడాన్ని కూడా ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. ఇంకా, కొందరు కాంగ్రెస్ ఎంపీలు ప్రధానమంత్రి సీటు వద్దకు వెళ్లి అవాంఛనీయ ఘటనలకు పాల్పడవచ్చన్న సమాచారంతో ప్రధాని నరేంద్ర మోదీ సభకు రాకుండా ఉండాలని తాను సూచించానని స్పీకర్ ఓం బిర్లా చేసిన వ్యాఖ్యలు కూడా ప్రతిపక్షాలకు ఆగ్రహం కలిగించాయి. ఈ వ్యాఖ్యలు స్పీకర్ వ్యవహారశైలిపై సందేహాలు కలిగిస్తున్నాయని వారు అంటున్నారు. మొత్తానికి, స్పీకర్ వ్యవహారశైలిపై ప్రశ్నలు లేవనెత్తుతున్న ప్రతిపక్షాలు ఒకవైపు, తమ నిర్ణయంపై నిలబడిన అధికార పక్షం మరోవైపు ఉండటంతో లోక్‌సభ రాజకీయ వాతావరణం మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో అవిశ్వాస నోటీసుపై స్పీకర్ కార్యాలయం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది కీలకంగా మారింది.

ఒవైసీ బ్రదర్స్ అధికారం చుట్టూ తిరిగే సన్ ఫ్లవర్స్

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్ లో కవిత మాట్లాడుతూ మాట్లాడారు. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ కోసం ఓవైసీ బ్రదర్స్ అభ్యర్థినే పెట్టలేదని రేవంత్ రెడ్డి వచ్చాక రంజాన్ తోఫా ఇవ్వలేదని, ఓవైసీ బ్రదర్స్ ముస్లింల కోసం రేవంత్ రెడ్డితో రంజాన్ తోఫా ఇప్పించాలని అన్నారు. ఓల్డ్ సిటీలో ఇప్పటికీ అసలు అభివృద్ధి అనేది లేదని, ఓవైసీ సోదరులు ఓల్డ్ సిటీలో ఎందుకు ఉండటం లేదు? అని ఆమె ప్రశ్నించారు. ఈ నెల 12 న జరిగే లేబర్ కోడ్ బిల్లుకు వ్యతిరేకంగా జరిగే బంద్ కు మద్దతిస్తున్నామని కవిత ప్రకటించారు. అదే రోజు జాగృతి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ జరుగుతుందని తెలిపారు.

హామీలు నెరవేర్చేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

కాంగ్రెస్ హామీలు నెరవేర్చేందుకు రాబోయే రాష్ట్ర బడ్జెట్ లో నిధులు కేటాయించాలని కవిత అన్నారు. 1.89 లక్షల ఉద్యోగాల భర్తీకి బడ్జెట్ లో ప్రొవిజన్ పెట్టాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని అన్నారు. బీసీలకు బడ్జెట్ లో రూ.20 వేల కోట్లు కేటాయించాలని, బీసీ సబ్ ప్లాన్ ప్రకటించాలని కవిత డిమాండ్‌చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేయాలని కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల నుంచి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వరకు పలు అంశాలపై ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు మండి పడ్డారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత పెద్ద బూతుల వర్షం ముగిసినట్లుగా అనిపించిందని వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల ప్రచారంలో ఎక్కడా ప్రజల అసలు సమస్యలపై చర్చ జరగలేదని, ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నమే జరిగిందని ఆరోపించారు. నీటి సమస్య, ప్రజా రవాణా, డ్రైనేజీ, విద్య, వైద్యం వంటి మౌలిక సమస్యలను పూర్తిగా పక్కన పెట్టి వ్యక్తులను తిట్టుకోవడానికే ప్రచారం పరిమితమైందన్నారు. మున్సిపల్ ఎన్నికలు పార్టీ గుర్తుల్లేకుండా జరిగితే ప్రజా సమస్యలపై నిజమైన చర్చ జరిగేదని అభిప్రాయపడ్డారు. బీజేపీ జాతీయాధ్యక్షుడు వచ్చి ప్రచారం చేసినప్పటికీ మహబూబ్‌నగర్‌లో ఇప్పటికీ రెండు రోజులకు ఒకసారి మాత్రమే నీళ్లు వస్తున్నాయని గుర్తు చేశారు. గతంలో ఉన్న బస్సు సర్వీసులే ఇప్పటికీ కొనసాగుతున్నాయని, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌పై ఎలాంటి దృష్టి పెట్టలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తక్కువగా, పంతులు ఎక్కువగా ఉన్న పరిస్థితి ఉందని, బస్తీ దవాఖానాల్లో మందులు, డాక్టర్లు లేకపోయినా సమీక్షలు జరగడం లేదని విమర్శించారు. రోడ్లు, డ్రైనేజీల్లో చెత్త గుట్టలుగా పేరుకుపోయినా ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదన్నారు.

ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కలిసాశాయి

ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కలిసాయని, అదే విధంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య కూడా సర్దుబాట్లు జరిగాయని ఆరోపించారు. అందుకే ప్రజలు పార్టీలు కాకుండా మంచి వ్యక్తిని చూసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. సింహం గుర్తుపై పోటీ చేస్తున్న తెలంగాణ జాగృతి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 116 మున్సిపాలిటీలు ఉంటే ఒక్క మున్సిపాలిటీకి మాత్రమే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వచ్చిందని తెలిపారు. గుంపుమేస్త్రీ-గుంటనక్క స్నేహం కారణంగా సిద్దిపేట్‌కే ఆ మంజూరు జరిగిందని విమర్శించారు. బీఆర్ఎస్ ఉన్నా, కాంగ్రెస్ ఉన్నా గుంటనక్కకే పనులు అవుతున్నాయన్నారు. ఈ నెల 26న రాబోయే బడ్జెట్ గుణాత్మక మార్పునకు చివరి అవకాశం అని కవిత పేర్కొన్నారు. 2028, 2029లో ఎన్నికలు ఉన్నప్పుడు పూర్తి స్థాయి బడ్జెట్ పెట్టే అవకాశం ఉండదని, అందుకే ఇప్పటి బడ్జెట్ చాలా కీలకమన్నారు. ప్రభుత్వం వచ్చాక సంపద సృష్టించాల్సింది పోయి రూ.7 వేల కోట్ల విలువైన భూములను అమ్మిందని, రెవెన్యూ డెఫిసిట్ రూ.9 వేల కోట్లకు చేరిందని, అప్పులు 122 శాతం పెరిగాయని విమర్శించారు. గత బడ్జెట్‌లో పెన్షన్ల కోసం కేటాయించిన రూ.1.21 లక్షల కోట్లలో కేవలం రూ.51 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి, పేదల పెన్షన్లకు కోత పెట్టి కాంట్రాక్టర్లకు డబ్బులు ఇచ్చారని ఆరోపించారు. కమీషన్లు ఎక్కువ వచ్చే చోట్లే ఖర్చు చేశారని, కాంట్రాక్టర్లకు లక్ష్యాన్ని మించి చెల్లింపులు జరిగాయని అన్నారు. గత తొమ్మిది నెలల్లో పేదలకు తగ్గించి కాంట్రాక్టర్లకు ఎక్కువ నిధులు ఇచ్చారని విమర్శించారు. వచ్చే బడ్జెట్‌ను కనీసం రూ.3 లక్షల 25 వేల కోట్లుగా రూపొందించే అవకాశం ఉందని పేర్కొన్న కవిత, బీసీ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ల ప్రకారం నిధులు కేటాయించాల్సిందేనన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం ఏటా బీసీలకు రూ.20 వేల కోట్లు కేటాయించి బీసీ సబ్ ప్లాన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అవ్వ-తాతలకు, మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, పెన్షన్ల కోసం బడ్జెట్‌ను డబుల్ చేసి రూ.35 వేల కోట్లు కేటాయించాలన్నారు.

పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లకు నిధులు కేటాయించలేదని, 8 లక్షల ఇళ్లకు వెంటనే నిధులు అవసరమన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేల పెన్షన్ కోసం బడ్జెట్ లో ప్రొవిజన్ పెట్టాలన్నారు. కళాకారులకు రాష్ట్రం రూ.500 ఇస్తే కేంద్రం రూ.13 వేలకుపైగా ఇస్తోందని, దానికి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. రైతులు, కౌలు రైతులకు ఇచ్చిన హామీల కోసం రూ.25 వేల కోట్లు కేటాయించాలని, యాసంగి రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ వందశాతం చేశామని సీఎం చెప్పడాన్ని కవిత సవాల్ చేస్తూ నిజామాబాద్, మహబూబ్‌నగర్ లేదా సచివాలయం ఎక్కడైనా చర్చకు సిద్ధమన్నారు. రూ.44 వేల కోట్ల రుణమాఫీ అన్నారు కానీ వాస్తవంగా రూ.21 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారని ఆరోపించారు. రైతులకు కనీసం యూరియా కూడా అందించలేని పరిస్థితి ఉందన్నారు. విద్యార్థులకు రూ.11 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ ఉండటంతో ఆడబిడ్డలు నష్టపోతున్నారని చెప్పారు. తెలంగాణకు ముందు ఆర్టీసీలో 52 వేల మంది కార్మికులు ఉండగా ఇప్పుడు 32 వేలకు తగ్గిపోయారని, చిన్న కారణాలకే ఉద్యోగాల నుంచి తొలగించారని విమర్శించారు. ఎలక్ట్రిక్ బస్సుల్లో ఆర్టీసీ ఉద్యోగులనే నియమించాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

మహిళలకు ఇచ్చిన స్కూటీ, తులం బంగారం హామీలను వెంటనే అమలు చేయాలని, ప్రభుత్వం 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నప్పటికీ కేవలం 11 వేలే ఇచ్చిందని చెప్పారు. మిగిలిన 1.89 లక్షల ఉద్యోగాలకు సంబంధించిన జీతాల నిధులు బడ్జెట్‌లో కేటాయించి వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, పరీక్షలు ఎప్పుడు జరుగుతాయో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి నష్టం చేసే కేంద్ర నిర్ణయాలపై సీఎం స్పందించకపోవడం బాధాకరమన్నారు. లేబర్ కోడ్ బిల్లుపై స్పందించకపోయినా, ఈ నెల 12న జరిగే లేబర్ కోడ్‌కు వ్యతిరేక బంద్‌కు తెలంగాణ జాగృతి మద్దతు ఇస్తుందని ప్రకటించారు. అదే రోజు తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కులగణన, ఉపాధి హామీ, మైనార్టీ బడ్జెట్ వంటి అంశాల్లో సీఎం కేంద్రానికి సహకరిస్తున్నారని ఆరోపించారు.

ఏపీ నీళ్ల దోపిడీ

మొదటిపేజీ తరువాయి

ఒప్పందంలో ఉన్న 66 శాతం పరిమితిని దాటి 80 శాతానికి చేరిందని అధికారిక లేఖల ఆధారాలతో వెల్లడించారు. ఏపీ నీటి దోపిడిని అడ్డుకోవడంలో సీఎం రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. కృష్ణా నదీ జలాలను ఆంధ్రప్రదేశ్ అక్రమంగా, అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా తరలించుకుపోతుంటే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో కూర్చొని చూస్తూ ఊరుకుంటున్నారని మండిపడ్డారు. తాము పూర్తి ఆధారాలతో మాట్లాడుతున్నామని, ఇది రాజకీయ ఆరోపణలు కాదని స్పష్టం చేశారు.తెలంగాణ ఇరిగేషన్ శాఖ కేఆర్ఎంబీకి రాసిన అధికారిక లేఖను చూపిస్తూ, ఈ వాటర్ ఇయర్‌లో జనవరి 29, 2026 నాటికి ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే 664 టీఎంసీల నీటిని వినియోగించుకుందని, ఇది మొత్తం కృష్ణా జలాల్లోదాదాపు 80 శాతం అని హరీశ్ రావు వెల్లడించారు. తాత్కాలిక ఒప్పందం ప్రకారం ఏపీకి కేవలం 66 శాతం మాత్రమే హక్కు ఉండగా, ఆ పరిమితిని చాలా ముందే దాటిపోయిందని చెప్పారు. ఇంకా రెండు రోజుల్లో మరింత అధిక వినియోగం జరుగుతుందని జనవరి 28న ఇఎన్సీ కేఆర్ఎంబీకి లేఖ రాసారని తెలిపారు. ఆ లేఖలో తక్షణమే బోర్డు మీటింగ్ నిర్వహించి ఏపీ నీటి దోపిడీని ఆపాలని స్పష్టంగా కోరినప్పటికీ, అదే రోజున ఇఎన్సీ రిటైర్ అయ్యారని, ఆ తర్వాత వారం రోజులపాటు ఆ కీలక పోస్టును ఖాళీగా ఉంచారని విమర్శించారు. లెక్కకు మించిన నీళ్లు తీసుకుపోతున్న సమయంలో ఇఎన్సీ పోస్టు ఖాళీగా ఉంచడం వెనుక ఏ ఉద్దేశం ఉందని ప్రశ్నించారు. మీడియా ప్రశ్నించిన తర్వాతే పోస్టు భర్తీ చేశారని, ఇది రాష్ట్ర ప్రయోజనాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. తాత్కాలిక అగ్రిమెంట్ ప్రకారం తెలంగాణకు 34 శాతం నీటిని వినియోగించుకునే హక్కు ఉన్నప్పటికీ, ఇప్పటివరకు కేవలం 20 శాతం మాత్రమే వినియోగించుకున్నామని, అంటే మనకు రావాల్సిన 174 టీఎంసీల నీటిని కూడా ప్రభుత్వం వినియోగించుకోలేకపోయిందని ఆరోపించారు. ఇదే సమయంలో ఏపీ రోజుకు ఇంకా 1.5 టీఎంసీల నీటిని తరలించుకుపోతున్నదని చెప్పారు. వేసవి సమీపిస్తున్న వేళ తెలంగాణకు తాగునీరు, పంటలు, పరిశ్రమల అవసరాలు తీవ్రంగా ఉన్నాయని, మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో పంటల పరిస్థితి దయనీయంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. “సర్కారు నడుపుతున్నారా? సర్కస్ నడుపుతున్నారా?” అంటూ ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. బీఆర్ఎస్ పాలనతో పోలిస్తే కాంగ్రెస్ హయాంలో కృష్ణా జలాల వినియోగం ఎవర్ లోయెస్ట్ స్థాయికి పడిపోయిందని, వరుసగా రెండేళ్లుగా అతి తక్కువ నీటిని వినియోగించి సీఎం రేవంత్ రెడ్డి చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లిస్తున్నారని ఆరోపించారు. ఈ ఏడాది కూడా 20 శాతం దాటలేదని, ఇది ముఖ్యమంత్రి వైఫల్యానికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. “హక్కులు కాపాడాల్సిన ముఖ్యమంత్రి రాష్ట్రానికి శాపంగా మారాడు” అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇఎన్సీ లేఖలో ఏపీ 664 టీఎంసీలు తీసుకుపోయిందని పేర్కొంటే, కేఆర్ఎంబీ మాత్రం తన లేఖలో 555 టీఎంసీలు మాత్రమే వినియోగించిందని చెప్పడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వంద టీఎంసీల తేడాను సీఎం రేవంత్ ఎందుకు ప్రశ్నించడం లేదని, బీజేపీ ఆధీనంలో ఉన్న కేఆర్ఎంబీ ఏపీని ఎందుకు నిలదీయడం లేదని నిలదీశారు. రాష్ట్రంలో ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేసీఆర్‌పై విమర్శలు చేయడం తప్ప తెలంగాణకు జరుగుతున్న నీటి అన్యాయంపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఆర్ఆర్ ట్యాక్స్, స్కాంలు బయటపడతాయన్న భయంతో కాంగ్రెస్, బీజేపీ రెండూ మౌనంగా ఉన్నాయని, ఇద్దరూ కలిసి తెలంగాణ రైతుల గొంతు పిసుకుతున్నారని ఆరోపించారు. చంద్రబాబు-రేవంత్ మధ్య ఫెవికాల్ బంధం ఉండొచ్చేమో కానీ రాష్ట్ర హక్కులను ఆంధ్రాకు రాసివ్వడం ద్రోహమని మండిపడ్డారు. ఏపీకి జరుగుతున్న అక్రమ నీటి తరలింపును తక్షణమే అడ్డుకోవాలని, క్యారీ ఫార్వర్డ్ విధానంలో శ్రీశైలంలో ఉన్న నీటిని నిల్వ ఉంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. త్వరలో కేఆర్ఎంబీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, కేంద్ర మంత్రులను కలుస్తామని, పార్లమెంట్ లో ఈ అంశాన్ని గట్టిగా లేవనెత్తుతామని ప్రకటించారు. తెలంగాణ నుంచి ఉన్న 16 మంది బీజేపీ-కాంగ్రెస్ ఎంపీలు రాష్ట్ర హక్కులు కాపాడటంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర నీటి హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం ఆగదని స్పష్టం చేసిన హరీశ్ రావు, 19 చోట్ల బీఆర్ఎస్ టెలిమెట్రీలు ఏర్పాటు చేస్తే, మిగతా 9 చోట్ల కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని తెలిపారు.ఈ కార్యక్రమంలో శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదన చారి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం

మొదటిపేజీ తరువాయి

కొనసాగనుంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణ కోసం 1,379 మంది రిటర్నింగ్ అధికారులు, 41,773 మంది పోలింగ్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఓటర్లు తమ ఓటర్ స్లిప్పులను ఎస్ఈసీ వెబ్‌సైట్ లేదా టీపోల్‌యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. మొత్తం 2,981 వార్డులకుగాను 12,944 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 116 మున్సిపాలిటీల్లోని 2,569 వార్డులకు పోలింగ్ జరగనుంది. తొమ్మిది మున్సిపాలిటీల్లో 12 మంది అభ్యర్థులు ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మున్సిపాలిటీల్లో అధికార కాంగ్రెస్ నుంచి 2,358 మంది, బీఆర్ఎస్ నుంచి 2,478 మంది, బీజేపీ నుంచి 2,252 మంది సహా మొత్తం 10,719 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అయితే, సోమవారం రాత్రి నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడంతో ఆ వార్డులో పోలింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు ఎస్ఈసీ ప్రకటించింది. మున్సిపాలిటీల కోసం 6,017 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇక 7 మున్సిపల్ కార్పొరేషన్లలోని 412 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మహబూబ్‌నగర్, రామగుండం కార్పొరేషన్లలో రెండు వార్డుల్లో అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. ఈ కార్పొరేషన్లలో కాంగ్రెస్ నుంచి 410, బీఆర్ఎస్ నుంచి 401,



బీజేపీ నుంచి 382 మంది సహా మొత్తం 2,225 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. కార్పొరేషన్ల పరిధిలో 2,174 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని డీజీపీ బి. శివధర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 1,302 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా, 1,926 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించామని, అక్కడ అదనపు బలగాలను మోహరించామని వివరించారు. పారదర్శకత కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామని, సమస్యాత్మక ప్రాంతాల్లోని కేంద్రాల బయట నిఘా కెమెరాలు కూడా ఉపయోగిస్తున్నామని చెప్పారు. ఎన్నికల విధులు కేటాయించడంతో ప్రభుత్వ ఉద్యోగులు ఇప్పటికే పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరారు. పోలింగ్ కేంద్రాల్లో చేపట్టాల్సిన విధి విధానాలను ఇప్పటికే సిబ్బందికి ఉన్నతాధికారులు వివరించారు. ఎన్నికల కోసం 8,203 పోలింగ్ కేంద్రాలు, 16,301 బ్యాలెట్ బాక్సులను ఎన్నికల సంఘం ఇప్పటికే సిద్ధం చేసింది. ఈ ఎన్నికల్లో దాదాపు 52 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికలు జరిగే ప్రాంతంలో.. పోలింగ్ సమయంలో మద్యం షాపులు మూసేయాలని ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక ఎన్నికలు జరగనున్న ప్రదేశాల్లో స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు సెలవు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అలాగే భారీగా పోలీసులను మోహరించారు. తమ ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ ఓటర్లకు జిల్లా అధికారులు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకుని అగ్రస్థానంలో నిలిచింది. ఇక ఈ ఎన్నికల్లో సైతం తమ సత్తా చాటుతామని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటా పోటీగా ప్రచారాన్ని నిర్వహించాయి. ఓటరు ఎవరికి పట్టం కడతాడనేది ఫిబ్రవరి 13న తేలనుంది.

“

ఏపీ రైతులపైనే అప్పుల భారం ఎక్కువగా ఉంది. జులై 2018-జూన్ 2019 మధ్య ఏపీలోని ఒక్కో రైతు కుటుంబంపై సగటున రూ.2,35,554 అప్పు ఉంది. తెలంగాణ రైతుల సగటు అప్పు రూ.1,52,113గా ఉంది. దేశవ్యాప్తంగా ఉన్న రైతుల సగటు అప్పు రూ.74,121. అప్పుల భారం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల జాబితాలో ఏపీ మొదటి స్థానంలో ఉండగా, తెలంగాణ 5వ స్థానంలో ఉంది.

- లోక్‌సభలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్

రాష్ట్రీయం

తెలంగాణపై కేంద్రం ఆర్థిక వివక్ష

- రాష్ట్రానికి నిధుల్లో కోత.. ఫెడరలిజంపై దాడే
- సొమ్ములు మావి.. గొప్పలు మీవా.?
- తెలంగాణ కేంద్రానికి ఇచ్చేది 1,33,208 కోట్లు... కేంద్రం తిరిగి ఇచ్చింది కేంద్ర పథకాలతో కలిపి కేవలం 51 వేల కోట్లే
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 10 : దేశానికి అధికంగా ఆదాయం సమకూర్చుతున్న దక్షిణాది రాష్ట్రాలు నేటి కేంద్ర ఆర్థిక విధానాల వల్ల అన్యాయానికి గురవుతున్నాయని, ఇది కేవలం ఆర్థిక వివక్షే కాదు.. రాజకీయ ఉద్దేశంతో కూడిన వివక్ష అని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. "వికసిత్ భారత్" అనే నినాదం ఇస్తూ దేశ అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం, దక్షిణాది రాష్ట్రాల పట్ల ముఖ్యంగా తెలంగాణ విషయంలో స్పష్టమైన వివక్ష, నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తోందని అన్నారు.

దేశ ఆదాయానికి దక్షిణాది వెన్నెముక

2018-19 నుంచి 2022-23 వరకు ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం వసూలు చేసిన మొత్తం పన్నులు రూ.90.80 లక్షల కోట్లు అయితే, ఇందులో దక్షిణాది రాష్ట్రాల నుండే పావుభాగానికి పైగా రూ. 22.86 లక్షల కోట్లు వచ్చాయన్నారు. అయినప్పటికీ, ఈ స్థాయిలో ఆదాయం ఇచ్చిన దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం తిరిగి ఇచ్చిన నిధులు మాత్రం కేవలం 16.3 శాతం మాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయి. ఇది ఆర్థిక సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధం అని మంత్రి వ్యాఖ్యానించారు. పన్నులు చెల్లించిన ప్రతి రూపాయికి తిరిగి వచ్చే నిధులను పోల్చితే కేంద్రం పాటిస్తున్న ద్వంద్వ వైఖరి బయటపడుతుందని మంత్రి తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు రూపాయికి సగటున 30 పైసలు ఇస్తూ, ఇదే సమయంలో బీహార్, ఉత్తరప్రదేశ్ లాంటి ఉత్తరాది రాష్ట్రాలకు రూ.1కి రూ.4 చొప్పున ఇస్తున్నారని, ఇది ఆర్థిక అసమతుల్యతను పెంచడమే కాకుండా, ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభేదాలను సృష్టించే ప్రమాదకర ధోరణి అని హెచ్చరించారు.

తెలంగాణ గణాంకాలే సాక్ష్యం

డిసెంబర్ లో జరిగిన పార్లమెంట్ సమావేశాలలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా 2024-25 లో తెలంగాణ రాష్ట్రం నుండి 1,33,208 కోట్ల పన్నులు వసూలు అయితే.. కేంద్రం నుండి రాష్ట్రానికి కేంద్ర పన్నుల రూపంలో 27,050 కోట్లు, కేంద్ర గ్రాంట్ల రూపంలో 7,913 కోట్లు, కేంద్ర ప్రాయోజిక పథకాల రూపంలో 16,762 కోట్లు మొత్తంగా 51,725 కోట్లు విడుదల చేసినట్టు పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి సమాధానం చెప్పారని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. "పథకాల రూపంలో వచ్చిన నిధులను కూడా కలిపితేనే ఈ మొత్తం వస్తోంది. స్వేచ్ఛగా వినియోగించుకునే నిధులు మాత్రం మరింత తక్కువ" అని మంత్రి వివరించారు.

జీఎస్టీతో నష్టపోతున్న రాష్ట్రం

జీఎస్టీ సవరణల కారణంగా తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే ఏడాదికి సుమారు రూ.8 వేల కోట్లు నష్టపోతోందని మంత్రి తెలిపారు. ఇక 15వ ఆర్థిక సంఘం సూచించిన రెవెన్యూ లోటు గ్రాంట్లను 16వ ఆర్థిక సంఘం పూర్తిగా పక్కన పెట్టడంతో రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యం దెబ్బతిన్నదని విమర్శించారు. రంగాలవారీగా, రాష్ట్రాల ప్రత్యేక గ్రాంట్లకు కత్తెర పెట్టడం వల్ల తెలంగాణకు మరో రూ.5 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. "ఇది కేవలం లెక్కల విషయం కాదు. ఇది కేంద్రంలో ఉన్న పాలకుల రాజకీయ ఆలోచనల ఫలితం. బలమైన రాష్ట్రాలను బలహీనపరచి, ఆర్థికంగా ఆధారపడేలా చేయాలనే ఉద్దేశమే కనిపిస్తోంది" అని తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలలో బిజెపి పార్టీ అస్థిత్వాన్ని నిలబెట్టుకోవాలనే ఉద్దేశ్యంతోనే దక్షిణాది రాష్ట్రాలకు ముఖ్యంగా తాము అధికారంలో లేని రాష్ట్రాలకు తక్కువ నిధులు విడుదల చేసి, వారి కుంచిత స్వభావాన్ని చూపెడుతున్నారని అన్నారు. ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్రాలు భాగస్వాములే కాని, కేంద్రం దయాధర్మాలపై ఆధారపడేవి కావని మంత్రిగారు స్పష్టం చేశారు. దేశ సమగ్ర అభివృద్ధి సాధించాలన్న, కేంద్రం చెప్పుకుంటున్న వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలన్నా, అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరగాలని, ముఖ్యంగా ఆదాయం సమకూర్చే రాష్ట్రాలపై వివక్ష మానుకోవాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని మంత్రి కోరారు.

చెరువుల అభివృద్ధిలో హైడ్రా పనితీరు భేష్

- చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత
- ఉప్పల్ నల్లచెరువును పరిశీలించిన మంత్రి శ్రీధర్‌బాబు

ప్రతిపక్షం, హైదరాబాద్, ఫిబ్రవరి 10: పర్యావరణ హితమైన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి హైడ్రా చేస్తున్న కృషి అభినందనీయమని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల పరిరక్షణలో హైడ్రా చొరవను కొనియాడారు. ముఖ్యంగా నగరంలో చెరువుల అభివృద్ధికి హైడ్రా ఎంతో కృషి చేస్తోందన్నారు. చెరువుతో పాటు, ఆ పరిసర ప్రాంతాల రూపురేఖలు మారిపోతున్నాయన్నారు. వరద నివారణతో పాటు.. పర్యావరణ పరిరక్షణకు, జీవవైవిధ్యానికి, భూగర్భ జలాల పరిరక్షణకు చెరువుల ప్రాధాన్యతను గుర్తించే వాటి అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. ఉప్పల్‌లోని ఎస్ఎన్డీపీ ప్రాజెక్టు పనులు ప్రారంభోత్సవానికి మంగళవారం వచ్చిన మంత్రి శ్రీధర్ బాబు ఉప్పల్ నల్ల చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ పి. మహేందర్ రెడ్డితో కలిసి ఐటీ మంత్రి ఉప్పల్ నల్లచెరువును సందర్శించారు. ఈ సందర్భంగా చెరువును ఎలా అభివృద్ధి చేస్తున్నారు.. ఏలా తీర్చిదిద్దుతున్నారు అనే విషయాలను అక్కడ చెరువు పనులను పర్యవేక్షిస్తున్న విమోస్ టెక్నోక్రాట్స్ సంస్థ యజమాని మహమ్మద్ యూనస్‌ను అడిగి తెలుసుకున్నారు. చెరువు అభివృద్ధి పనులకు సంబంధించిన 3డీ నమూనాలను మంత్రి పరిశీలించారు.

ఫ్రంట్ ఎలివేషన్ బాగుండాలి..

ఉప్పల్ నల్లచెరువు ఫ్రంట్ ఎలివేషన్ బాగుండాలని మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. వరంగల్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని ఈ చెరువుందని, దాదాపు కిలోమీటరు పొడవునా చెరువు విస్తరించి ఉందని, రోడ్డు పొడవునా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. చెరువు చుట్టూ 2 కిలోమీటర్లకు పైగా వాకింగ్ ట్రాక్ వస్తుందని.., చిన్న పిల్లలు ఆడుకునే ప్లే ఏరియా, చెరువు చుట్టూ సీటింగ్ సౌకర్యం, పచ్చిక బైళ్లు, పార్కులు, అన్ని వయసులవారికి వ్యాయామ పరికరాలు అందుబాటులోకి వస్తున్నాయని, అక్కడ పనులు చేపడుతున్న వారు మంత్రికి తెలిపారు. మురుగు నీరు కలవకుండా డైవర్ట్ కాలువలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఆక్రమణలతో 55 ఎకరాలకు కుంచించుకుపోయిన చెరువును 69 ఎకరాలకు విస్తరించామని, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇప్పటికే పలుమార్లు ఇక్కడికి వచ్చి పనులను పర్యవేక్షించారన్నారు.

క్యాన్సర్‌బాధిత బాలలకు చిత్రలేఖనం పోటీలు

- ఎస్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ సుధా రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 10 : అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినోత్సవం (ఐసీసీడీ) సందర్భంగా మంగళవారం నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) లో బాలలకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. నిమ్స్ మెడికల్ ఆంకాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో సుధా రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ సుధా రెడ్డి పాల్గొన్నారు. క్యాన్సర్ చికిత్స పొందుతున్న చిన్నారులకు ధైర్యం, ఆనందం కలిగించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 15న అంతర్జాతీయ బాల్య క్యాన్సర్ దినోత్సవం(ఐసీసీడీ)ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. చిన్నారుల్లో వచ్చే క్యాన్సర్ వ్యాధులపై అవగాహన పెంపొందించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. 2024 నుంచి 2026 వరకు ఐసీసీడీ కార్యక్రమానికి సవాళ్లను ఎదుర్కోవటం, స్ఫూర్తిదాయకమైన చర్యల ద్వారా ప్రతిభను ప్రదర్శించడం అనే రోడ్‌మ్యాప్‌ను రూపొందించారు. ఈ థీమ్ ద్వారా క్యాన్సర్‌తో పోరాడుతున్న పిల్లలు, క్యాన్సర్ నుంచి కోలుకున్న వారు, వారి సంరక్షకులు, వైద్య సిబ్బంది ఎదుర్కొనే సవాళ్లను వెలుగులోకి తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకున్నారు. పెడియాట్రిక్ ఆంకాలజీ వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులకు సుధా రెడ్డి చిత్రలేఖన పోటీ నిర్వహించారు. పోటీలో పాల్గొన్న ప్రతి చిన్నారికి బహుమతులు, పురస్కారాలు అందజేశారు. సమగ్ర క్యాన్సర్ చికిత్సలో మానసిక, సామాజిక మద్దతు, సరైన పోషణ ఎంతో ముఖ్యమని తెలిపారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ బీరప్ప మాట్లాడుతూ క్యాన్సర్ బాధిత చిన్నారుల పట్ల సుధా రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ సుధా రెడ్డి సేవాభావం, సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. మెడికల్ ఆంకాలజీ విభాగం తరపున సుధా రెడ్డి, ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డా. సదాశివుడు గుండేటి, విభాగ అధ్యాపకులు, రెసిడెంట్ వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.

పార్టీ ఫండ్ పంపిణీలో భారీ మాయాజాలం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, ఉత్తర తెలంగాణ,ఫిబ్రవరి 10: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఒక ప్రముఖ రాజకీయ పార్టీకి సంబంధించిన పార్టీ ఫండ్ పంపిణీ వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. పార్టీ హైకమాండ్ నుంచి వచ్చిన నిధులను స్థానిక స్థాయిలో పంపిణీ చేసే క్రమంలో భారీగా డబ్బులు మాయం అయినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.నగరంలో ఆ పార్టీ నుంచి మొత్తం 66 మంది కార్పొరేటర్ అభ్యర్థులు పోటీలో ఉండగా, గెలుపు లక్ష్యంగా ఒక్కో అభ్యర్థికి సుమారు రూ.15 లక్షల చొప్పున పార్టీ ఫండ్ కింద నిన్న రాత్రి గుట్టుగా పంపిణీ చేసినట్లు సమాచారం. ఈ నిధులు హైకమాండ్ నుంచి స్థానిక పార్టీ ఇంచార్జ్‌కు చేరగా, ఆయన ఆధ్వర్యంలో పనిచేస్తున్న పీఆర్వోల ద్వారా అభ్యర్థులకు అందజేశారు.

డబ్బు కట్టల్లో షాకింగ్ షార్టేజీ

పీఆర్వోలు "సర్ పంపించారు" అంటూ డబ్బు కట్టలను అభ్యర్థులకు అందజేసి వెళ్లిపోయారు. అయితే అభ్యర్థులు డబ్బులు లెక్కించగా, ప్రతి లక్ష కట్టలో రూ.3,000 నుంచి రూ.5,000 వరకు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఇలా 15 లక్షల మొత్తంలో మొత్తం కలిపి సుమారు రూ.15,000 వరకు మాయం అయినట్లు తేలడంతో అభ్యర్థులు తీవ్ర అయోమయంలో పడ్డారు.

అడగలేక.. మింగలేక..!

కొంతమంది అభ్యర్థులు ఎన్నికలకు ముందు అనవసర గొడవలు ఎందుకని మౌనంగా ఉండిపోయారు. మరికొందరు మాత్రం స్థానిక పార్టీ ఇంచార్జ్‌ను ఫోన్‌లో ప్రశ్నించగా, "నేను పీఆర్వోలకి డబ్బు బెండలు బారాబరి ఇచ్చి పంపాను... షార్టేజీ ఎలా వచ్చిందో నాకు తెలియదు" అంటూ దాటవేత ధోరణిలో సమాధానం ఇచ్చినట్లు సమాచారం.

హైకమాండ్‌కు ఫిర్యాదు

ఈ వ్యవహారంపై కొందరు కార్పొరేటర్ అభ్యర్థులు ఇప్పటికే పార్టీ హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అయితే ఎన్నికలు సమీపంలో ఉండటంతో అసలు విషయం బయటకు రాకుండా గోప్యంగా ఉంచినట్లు సమాచారం. ఎన్నికల అనంతరం మాత్రం పార్టీ ఫండ్‌లో మాయమైన సుమారు రూ.15 లక్షల వ్యవహారంపై చర్యలు తప్పవు అన్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

ఇంచార్జ్, పీఆర్వోలపై నిఘా

లక్ష కట్టల్లో కోతలు పెట్టింది ఎవరు? డబ్బుల పంపిణీ సమయంలో అసలు ఏం జరిగింది? అనే అంశాలపై పార్టీ పెద్దలు ఇంచార్జ్, పీఆర్వోల కదలికలపై నిశితంగా నిఘా పెట్టినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. పార్టీ ఫండ్ మాయాజాలం చివరికి ఎవరి కొంప ముంచుతుందో? ఎన్నికల ఫలితాల తర్వాత అసలు నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

మున్సిపల్‌ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బుల పంపిణీ

- కఠిన చర్యలు తీసుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడండి
- తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవులు
- ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

ప్రతిపక్షం సిటీబ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 10: తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఓటుకు 10,000 వరకు డబ్బులు పంచుతున్నట్లు పలు పత్రికలలో తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్‌కేశవులు అన్నారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరచే అత్యంత దుర్మార్గమైన చర్యని, దీనిపై కఠిన చర్యలు తీసుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డాక్టర్ కేశవులు ఎన్నికల సంఘానికి ఇమెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఎన్నికలు ప్రజల విశ్వాసానికి ప్రతీక. కానీ ఓటును కొనుగోలు చేయడం అంటే ప్రజాస్వామ్యాన్ని అవమానించడం అని, డబ్బుతో గెలిచిన నాయకుడు ప్రజలకు సేవ చేయడని, ఖర్చు చేసిన డబ్బును తిరిగి సంపాదించుకోవడానికే పనిచేస్తాడని అన్నారు. దీనివల్ల అవినీతి పెరుగుతుంది, అభివృద్ధి ఆగిపోతుందని డాక్టర్ కేశవులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల అధికారులకు వెంటనే కఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నామని, అలాగే ఫ్లయింగ్ స్క్వాడ్లను బలోపేతం చేయాలని, నగదు రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని, సున్నిత ప్రాంతాలలో సీసీ కెమెరాల పర్యవేక్షణ పెంచాలని, డబ్బు పంపిణీపై కఠిన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ప్రజాస్వామ్య పరిరక్షణ ఎన్నికల కమిషన్ యొక్క రాజ్యాంగబద్ధ బాధ్యత అని అన్నారు. కాబట్టి ఎలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే ఓటర్లు డబ్బు తీసుకోవద్దని, డబ్బు ఇస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని, ఓటును మీ మనస్సాక్షి ప్రకారం వేయాలని కోరారు. అమ్మితే భవిష్యత్తు అమ్మినట్టేనని డాక్టర్ కేశవులు ప్రజలను కోరారు.

సీఎం గారూ.. మీకు మానవత్వం ఉందా?

- రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించాల్సిందే
- కేంద్ర మంత్రి బండి సంజయ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 10: రిటైర్డ్ ఉద్యోగులకు తక్షణమే బకాయిలు చెల్లించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. 'సీఎం గారూ... మీకు మానవత్వం ఉందా?' అని ప్రశ్నించారు. విశ్రాంత ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించకుండా మానసిక వేదనకు గురి చేయడం న్యాయమా అని ప్రశ్నించారాయన. రిటైర్డ్ అయ్యి రెండేళ్లయినా.. వారి బకాయిలను ఇంకా చెల్లించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 61 మంది విశ్రాంత ఉద్యోగులు తనువు చాలించారని, వారి చావులకు ఎవరు బాధ్యులని లేఖలో ప్రస్తావించారు. ప్రభుత్వ, విశ్రాంత ఉద్యోగులను రాష్ట్ర సర్కార్ ప్రాధాన్యం లేని కేటగిరీలుగా భావిస్తోందా అని బండి సంజయ్ నిలదీశారు. ప్రభుత్వ తీరు తెలంగాణకు మాయని మచ్చ అని విమర్శించారు. జీవితం మలి సంధ్యలో ప్రశాంతమైన జీవితాన్ని గడపాల్సిన రిటైర్డ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వమే మానసిక వేదనకు గురిచేస్తుండటం క్షమించరానిదన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వెంటనే వారికి బెనిఫిట్స్ అన్నింటినీ చెల్లించి సగౌరవంగా సన్మానించి పంపాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని కేంద్ర మంత్రి ఫైర్ అయ్యారు. దీనిని తక్షణమే అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుని వారి బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- 1.83 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రతిపక్షం సిటీ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 10: నగరంలోని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి గడిచిన ఐదేండ్లలో జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి పెట్టిందని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలో రూ.1.83 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డిలతో కలిసి మంగళవారం ప్రారంభించారు. వీటిలో ముషీరాబాద్ వార్డులోని గంగపుత్ర కాలనీలో రూ. 70 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులు, గాంధీనగర్లోని మాల బస్తీలో రూ.42 లక్షల తో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులు, కవాడిగూడ వార్డులోని అడ్వొకేట్ కాలనీలో రూ.30 లక్షల తో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు, రామ్‌గోపాల్‌పేట్ వార్డులోని కృష్ణనగర్ కాలనీలో రూ.41 లక్షల తో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఉన్నాయి. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలోని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి గడిచిన ఐదేండ్లలో జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను మేయర్ ఆదేశించారు. డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ జిహెచ్ఎంసీ పరిధిలో పౌర సదుపాయాల పెంపునకు జీహెచ్ఎంసీ అధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, జీహెచ్ఎంసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యలో మూల్యాంకనంపై ఎఫ్‌డీపీ

- ప్రధాన వక్తలుగా డాక్టర్ సుపర్ణ మజుందార్ కర్, డాక్టర్ శ్వేతా ముఖర్జీ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 10 : హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'ఉన్నత విద్యలో మూల్యాంకనం'పై రెండు రోజుల అధ్యాపక వికాస కార్యక్రమాన్ని (ఎఫ్.డీ.పీ)ని ఈనెల 1314 తేదీలలో నిర్వహించనున్నట్టు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ఇంటెన్సివ్, ఆచరణాత్మక కార్యశాలలో అన్ని విభాగాలలోని అధ్యాపకులను ఆచరణాత్మక నైపుణ్యాలతో సన్నద్ధం చేయడం ద్వారా ప్రభావవంతమైన, ఫలితఆధారిత అంచనా పద్ధతులను రూపొందించడానికి, అమలు చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలియజేశారు. కృత్రిమ మేధస్సు (ఏఐ), హైబ్రిడ్ అభ్యాస వాతావరణాల సవాళ్లకు ప్రతిస్పందిస్తూ, ఈ కార్యక్రమం విమర్శనాత్మక ఆలోచన, వాస్తవికత, అర్థవంతమైన విద్యార్థుల అభ్యాసాన్ని ప్రోత్సహించే ప్రామాణికమైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న అంచనా వ్యూహాలపై దృష్టి సారిస్తుందన్నారు. ఎఫ్.డీ.పీ. రూబ్రిక్ అభివృద్ధి, మూల్యాంకన రూపకల్పన, డిజిటల్ సాధనాల వాడకంపై ముఖాముఖి కార్యక్రమాల మేలు కలయికగా ఇది కొనసాగుతుందని తెలిపారు. బెంగళూరులోని క్రైస్ట్ డీమ్డ్ విశ్వవిద్యాయంలోని సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ సుపర్ణ మజుందార్ కర్, బెంగళూరు ప్రాంగణంలోని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఇన్ ఛార్జ్ డైరెక్టర్ డాక్టర్ శ్వేతా ముఖర్జీ ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తలుగా వ్యవహరిస్తారన్నారు. ఈ రెండు రోజులు అధ్యాపక వికాస కార్యక్రమం ముగిసే సమయానికి, ఇందులో పాల్గొన్నవారంతా కోర్సు అభ్యాస ఫలితాలతో అనుసంధానించబడిన నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక, ప్రామాణికమైన మూల్యాంకనాలపై ఆచరణాత్మక అంతర్దృష్టులను పొందుతారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

"

తప్పుడు లెక్కలతో సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలను మోసగిస్తున్నారు. 2024-25లో రాష్ట్ర నామినల్ జీఎస్డీపీ 11.75% వచ్చింది. రియల్ జీఎస్డీపీలో దేశంలోనే మూడో స్థానం దక్కింది. అయితే కాగ్‌రిపోర్టు ప్రకారం గవర్నమెంట్ రెవెన్యూ ట్యాక్స్ 1.97%(22వ ర్యాంక్) మాత్రమే రావడం ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రభుత్వ అప్పులు, అవినీతి, రాజకీయ కక్ష, తప్పుడు ప్రచారాల్లోనే చంద్రబాబు ఫస్ట్ వస్తారు.

- వైసీపీ చీఫ్ జగన్

ఓటు హక్కు.. ఎన్నికల కమిషన్ దయాభిక్ష కాదు

సర్ ప్రక్రియలో ఎలాంటి ఆటంకం కలిగించేందుకు అనుమతించబోమని, అన్ని రాష్ట్రాలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ విషయంలో అవసరమైతే ఆదేశాలు జారీ చేస్తామని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న ఓటరు జాబితా సమగ్ర సవరణ అంశంపై దాఖలైన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది.సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ మాట్లాడుతూ అధికారుల పేర్లు ఇవ్వాలని ఎన్నికల సంఘం రాష్ట్రాన్ని ఎప్పుడూ కోరలేదన్నారు. దీనికి సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ స్పందిస్తూ ప్రస్తుతం 8,500 మంది అధికారుల జాబితాను సమర్పించామని, దాన్ని కోర్టు స్వీకరించాలని కోరారు. దీనికి సీజేఐ స్పందిస్తూ ఆ జాబితాలో అధికారుల పేర్లు, హోదాలు, పనిచేసే ప్రాంతాల వివరాలు ఉన్నాయా అంటూ ఆరా తీశారు. వారిని ఎలా సంప్రదిస్తారు? మరుసటి రోజే సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారుల (ఈఆర్‌వో) వద్ద రిపోర్ట్ చేయగలరా? అంటూ ప్రశ్నించగా.. దానికి న్యాయవాది దివాన్ అవునని సమాధానం ఇచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సమీక్షలో భాగంగా పశ్చిమబెంగాల్ లోని ఓటర్ల జాబితాల్లోంచి వేలాది మంది ఓటర్లను అనర్హులుగా తొలగించారు. రాజ్యాంగ విరుద్ధంగా ఈ విధంగా తొలగించడం అన్యాయమని ధ్వజమెత్తుతూ దీనిపై తక్షణం జోక్యం చేసుకోవాలని కోరుతూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సుప్రీంకోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావడం సంచలనం కలిగించింది. ప్రత్యేక సమగ్ర సర్వే చేపట్టక ముందు పశ్చిమబెంగాల్ ఓటర్ల జాబితాలో 7.66 కోట్ల వరకు ఎంట్రీలు ఉండేవి. అందులోంచి 58 లక్షల పేర్లను తొలగించిన తరువాత ఎన్నికల కమిషన్ నమూనా జాబితాను ప్రకటించి 1.16 కోట్ల ఎంట్రీల్లో తార్కిక వైరుధ్యాలు ఉన్నాయని వెల్లడించింది. ఈ పొంతనలేని అసంబద్ధమైన పదజాలాన్ని ఉపయోగించి ఎన్నికల సంఘం పశ్చిమబెంగాల్ ప్రజలను తమ పాలకులను ఎన్నుకునే హక్కు నుంచి దూరం చేయడమే అవుతుంది. దీదీ వాదనలను న్యాయమూర్తులు జోయ్‌మల్య బాగ్చి, వీఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం అంగీకరించింది. సీఎం ఆవేదనలో నిజం ఉందని, ప్రతీ సమస్యకూ పరిష్కారం ఉంటుందని హామీ ఇచ్చింది. అనంతరం మమతా బెనర్జీ పిటిషన్‌పై స్పందన కోరుతూ ఎన్నికల సంఘానికి ధర్మాసనం నోటీసు కూడా జారీ చేసింది.విచారణ సందర్భంగా.. ఈసీఐపై మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ ప్రక్రియలో ఆధార్‌ను అంగీకరించకుండా కోర్టు ఆదేశాలను ఎన్నికల సంఘం ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. సర్ ఒత్తిడి కారణంగా 100 మందికిపైగా ప్రజలు మరణించారని దీదీ ఆరోపించారు. అనేక మంది ఆసుపత్రి పాలయ్యారన్నారు. ప్రజల హక్కులను కాపాడండి అంటూ దీదీ తన వాదనలను ముగించారు.

ప్రతిపక్షం
హైదరాబాద్
బుధవారం
11.02.2026

పురుషులు, మహిళలు వయసులో తేడాలు, 15 ఏళ్ల కన్నా తక్కువ లేదా 50 ఏళ్ల వరకు తమ తల్లిదండ్రులకు తమకు తేడా ఉండవచ్చు. కొన్నిసార్లు దంపతులకు ఆరు లేదా అంతకన్నా ఎక్కువ సంతానం ఉండవచ్చు. చాలా మంది మహిళలు తమ పేరు చివరన తమ భర్త పేరు చేర్చుకుంటుంటారు. ఇవన్నీ భారత దేశ ప్రజాజీవనంలో వాస్తవాలే తప్ప ఓటర్ల జాబితాలో పేర్లను కొట్టేసినంత శక్తివంతమైన తార్కిక వ్యత్యాసాలు కావు. ఈ సమస్యలను సుప్రీం కోర్టే స్వయంగా ప్రస్తావించిందని గుర్తు చేసుకోవాలి. ఓటర్ల జాబితాల్లోంచి పేర్లను తొలగించడానికి వాటిని సాకుగా ఉపయోగించడంపై తన అసమ్మతిని వ్యక్తం చేసింది కూడా. ఈ అసంబద్ధ కారణాలను ఎన్నికల కమిషన్‌కు ఎత్తిచూపడానికి తన వాదనలు వినిపించగా వాటిని ఎన్నికల కమిషన్ తిరస్కరించిందని మమతా బెనర్జీ ఆరోపిస్తున్నారు.ఇక చేసేది లేక ఆమె నేరుగా సుప్రీం కోర్టు ముందు హాజరై తన వాదనలను వినిపించారు. దీనికి సుప్రీం కోర్టు స్వాగతించింది. మనదేశం ప్రజాస్వామ్యయుతంగా పనిచేయడానికి కీలకమైన అంశాలు. రాజ్యాంగం లోని ఆర్టికల్ 21 ప్రకారం ఏ వ్యక్తి తన జీవితాన్ని లేదా వ్యక్తిగత స్వేచ్ఛను కోల్పోకూడదు. చట్టం ద్వారా నిర్దేశించిన ప్రక్రియ ద్వారా తప్ప మరెప్పుడూ అలా జరగకూడదు. ప్రతి పౌరుడికీ గౌరవంగా జీవించే ప్రాథమిక హక్కు ఉంటుంది. అదే విధంగా సర్వసత్తాక గణతంత్ర దేశంలో ప్రతి పౌరునికీ ఓటు వేసే ప్రాథమిక హక్కు ఉంటుంది. కాబట్టి దానిని జీవించే హక్కుతో సమానంగా పరిగణించాలి. ఓటరు జాబితా నుంచి ఎవరిని తొలగించినా చట్ట నిబంధనల ప్రకారం మొదట సరైన విధానాన్ని అవలంబించాలి. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటర్లు ఎవరినైనా అనర్హులని ప్రకటించడం వెనుక పోల్ ప్యానెల్‌లో పనిచేసే అధికారుల ఇష్టాయిష్టాలు, అభిరుచులు మాత్రమే బలీయమైన కారణం కాకూడదు. భారతీయులు ప్రతివారూ ఓటు వేయాలి.ఎందుకంటే అది వారి ప్రాథమిక హక్కు. అంతే తప్ప ఎన్నికల కమిషన్ దయాభిక్ష కాదు.

మున్సిపల్ సమరం: అభివృద్ధి వర్సెస్ అసంతృప్తి

మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాలకు సంకేతాలుగా కూడా పరిగణించబడతాయి. పట్టణాల్లో ఏ పార్టీకి ప్రజాభిమానం పెరుగుతోందో, ఏ వర్గాలు మార్పు కోరుకుంటున్నాయో ఈ ఎన్నికలు సూచిస్తాయి. అందువల్ల ప్రధాన పార్టీలు వీటిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని వ్యూహాత్మకంగా పోరాడుతాయి. ఎన్నికల అనంతరం ఫలితాల విశ్లేషణ పార్టీలు తమ బలహీనతలను గుర్తించేందుకు, భవిష్యత్ వ్యూహాలను సవరించేందుకు ఉపయోగపడుతుంది. మున్సిపల్ ఎన్నికలు స్థానిక సమస్యలు, అభివృద్ధి పనితీరు, అభ్యర్థుల వ్యక్తిత్వం, పార్టీ వ్యూహాలు, సామాజిక సమీకరణాలు... ఈ అన్నింటి సమ్మేళనం.

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

మున్సిపల్ ఎన్నికలు స్థానిక ప్రజాస్వామ్యానికి అద్దం పట్టే కీలక ప్రక్రియ. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీలు ఎంత ముఖ్యమో, పట్టణ జీవన విధానాన్ని తీర్చిదిద్దడంలో మున్సిపాలిటీలు అంతకన్నా కీలక పాత్ర పోషిస్తాయి. నీటి సరఫరా నుంచి మురుగు పారుదల వరకు, రోడ్ల నుంచి వీధి దీపాల వరకు, పట్టణ ప్రణాళిక నుంచి ప్రజా ఆరోగ్యం వరకు... ప్రతి అంశం మున్సిపల్ పాలనతో ముడిపడి ఉంటుంది. అందుకే మున్సిపల్ ఎన్నికలు కేవలం స్థానిక ప్రతినిధుల ఎంపిక మాత్రమే కాదు; రాష్ట్ర స్థాయి రాజకీయ సమీకరణాలకు, ప్రజాభిప్రాయ ధోరణులకు సూచికలుగా కూడా పరిగణించ బడతాయి. ఈ నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీల అవకాశాలు, ఫలితాల సాధ్యాసాధ్యాలు, వాటిపై ప్రభావం చూపే కారకాలు విశ్లేషణకు వస్తాయి.

పూర్వాపరాలను పరిశీలిస్తే, మున్సిపల్ ఎన్నికలు సాధారణంగా రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని ప్రతిబింబించే స్వభావం కలిగి ఉంటాయి. గత రెండు దశాబ్దాల ఎన్నికల ధోరణులను పరిశీలించినప్పుడు ఒక స్పష్టమైన లక్షణం కనిపిస్తుంది: అధికారంలో ఉన్న పార్టీకి పట్టణాల్లో మిశ్రమ ఫలితాలు రావడం. కొన్ని సందర్భాల్లో అధికార పార్టీ తన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఆధారంగా పట్టణ ఓటర్లను ఆకర్షిస్తే, మరికొన్ని సందర్భాల్లో స్థానిక సమస్యలు, అభివృద్ధి లోపాలు ప్రతిపక్షానికి అవకాశాన్ని కల్పిస్తాయి. సాధారణంగా పట్టణ ఓటర్లు అభివృద్ధి, పారదర్శకత, సేవల నాణ్యత వంటి అంశాలపై ఎక్కువ దృష్టి పెడతారని ఎన్నికల విశ్లేషకులు చెబుతుంటారు.

గణాంక పరంగా చూస్తే, మున్సిపల్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం సాధారణంగా 55 నుంచి 75 శాతం మధ్య ఊగిసలాడుతుంది. పెద్ద నగరాల్లో ఓటింగ్ కొంత తక్కువగా ఉండగా, చిన్న పట్టణాల్లో ఎక్కువగా నమోదవుతుంది. ఇది పట్టణ ప్రజల రాజకీయ చైతన్యం, స్థానిక సమస్యల తీవ్రత, పార్టీ స్థాయి నిర్వహణ వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. గత ఎన్నికల్లో అనేక పట్టణాల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఫలితాలు మారిన ఉదాహరణలు ఉన్నాయి. ఇది మున్సిపల్ ఎన్నికల్లో బూత్ స్థాయి నిర్వహణ, అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం ఎంత కీలకమో చూపిస్తుంది.

ప్రధాన పార్టీల అవకాశాలను విశ్లేషించినప్పుడు మొదట అధికార పార్టీ స్థితిని పరిశీలించాలి. అధికార పార్టీకి పరిపాలనా అనుభవం, వనరుల సమీకరణ, సంక్షేమ పథకాల ప్రచారం వంటి ప్రయోజనాలు ఉంటాయి. పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారి నిర్మాణం, డ్రైనేజీ, స్మార్ట్ సిటీ తరహా ప్రాజెక్టులు అమలు చేసినట్లయితే అవి ఎన్నికలలో ప్రచార ఆయుధాలుగా మారుతాయి. అయితే అదే సమయంలో పట్టణాల్లో ఎదురయ్యే ట్రాఫిక్ సమస్యలు, మురుగు పారుదల లోపాలు, ఆస్తి పన్నుల పెంపు, నీటి సరఫరా లోపాలు వంటి అంశాలు ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. అందువల్ల అధికార పార్టీ అవకాశాలు అభివృద్ధి-అసంతృప్తి మధ్య సమతుల్యతపై ఆధారపడి ఉంటాయి.

ప్రధాన ప్రతిపక్ష పార్టీకి మున్సిపల్ ఎన్నికలు ఒక

అవకాశ వేదిక. పట్టణ సమస్యలను ఎత్తిచూపడం, స్థానిక అసంతృప్తిని సమీకరించడం, ప్రత్యామ్నాయ పరిపాలనా దృష్టికోణాన్ని ప్రజల ముందుంచడం ద్వారా ప్రతిపక్షం తన బలాన్ని చాటుకోవచ్చు. ముఖ్యంగా యువ ఓటర్లు, మధ్యతరగతి వర్గాలు, చిన్న వ్యాపారులు వంటి వర్గాల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుంటే ప్రతిపక్షానికి ఊతం లభిస్తుంది. గత ఎన్నికల అనుభవం చెబుతున్నది ఏమిటంటే... పట్టణాల్లో ప్రతిపక్షం సాధారణంగా వార్డు స్థాయిలో బలమైన అభ్యర్థులను నిలబెట్టగలిగితే ఫలితాల్లో గణనీయమైన మెరుగుదల సాధ్యమవుతుంది.

మూడో శక్తులు, ప్రాంతీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కూడా మున్సిపల్ ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తారు. అనేక పట్టణాల్లో వ్యక్తిగత ప్రభావం, స్థానిక సామాజిక సమీకరణాలు, వృత్తి సంఘాల మద్దతు వంటి అంశాల ఆధారంగా స్వతంత్రులు విజయం సాధించిన సందర్భాలు ఉన్నాయి. కొన్ని చోట్ల త్రికోణ పోటీలు ఫలితాలను అనూహ్యంగా మార్చేస్తాయి. ఓట్ల విభజన ప్రధాన పార్టీల గెలుపోటములను ప్రభావితం చేస్తుంది. అందువల్ల చిన్న పార్టీల ప్రదర్శన కూడా మొత్తం రాజకీయ సమీకరణంలో కీలకంగా మారుతుంది.

అభ్యర్థుల ఎంపిక మున్సిపల్ ఎన్నికల్లో అత్యంత కీలక అంశం. స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండే, సమస్యలపై అవగాహన కలిగిన, సామాజికంగా అంగీకారం పొందిన అభ్యర్థులను ఎంపిక చేసిన పార్టీకి ఆధిక్యం లభించే అవకాశాలు ఎక్కువ. కుటుంబ ఆధారిత లేదా వర్గ రాజకీయాలు కొన్ని ప్రాంతాల్లో ప్రభావం చూపినా, పట్టణ ఓటర్లు క్రమంగా పనితీరు ఆధారంగా నిర్ణయం తీసుకునే ధోరణి పెరుగుతోందని విశ్లేషణలు సూచిస్తున్నాయి.

ప్రచార వ్యూహాలు కూడా ఫలితాలపై ప్రభావం చూపుతాయి. సంప్రదాయ డోర్‌టుడోర్ ప్రచారం, సామాజిక మాధ్యమాల వినియోగం, స్థానిక సమస్యలపై చర్చలు... ఇవి అన్నీ కలిపి ఓటర్లపై ప్రభావం చూపుతాయి. పట్టణాల్లో డిజిటల్ ప్రచారం ప్రాధాన్యం పెరుగుతున్నప్పటికీ, ప్రత్యక్ష సంప్రదింపులు ఇంకా కీలకమే. ముఖ్యంగా మహిళా ఓటర్లు, యువత, వృద్ధులు వంటి వర్గాల ప్రత్యేక అవసరాలను గుర్తించి ప్రచారం నిర్వహించిన పార్టీకి అదనపు మద్దతు లభించే అవకాశం ఉంది.

సామాజిక-ఆర్థిక అంశాలు కూడా మున్సిపల్ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తాయి. పట్టణ ఉపాధి అవకాశాలు, ధరల పరిస్థితి, చిన్న వ్యాపారాల స్థితి, రియల్ ఎస్టేట్ అభివృద్ధి, పన్నుల విధానం వంటి అంశాలు ఓటర్ల నిర్ణయంపై ప్రభావం చూపుతాయి. పట్టణ పేదలు సంక్షేమ పథకాల అమలుపై దృష్టి పెడితే, మధ్యతరగతి మౌలిక సదుపాయాలు, పారదర్శక పరిపాలనపై ఆసక్తి చూపుతుంది. ఈ విభిన్న అంచనాలను సమతుల్యం చేసే పార్టీకి ఎన్నికల్లో ప్రయోజనం కలుగుతుంది.

ఫలితాల అంచనాల విషయానికి వస్తే, మున్సిపల్ ఎన్నికలు సాధారణంగా మిశ్రమ తీర్పును ఇస్తాయి. కొన్ని పట్టణాల్లో అధికార పార్టీ ఆధిక్యం సాధిస్తే, మరికొన్నింటిలో ప్రతిపక్షం బలంగా ఎదగడం సాధారణం. ఓట్ల శాతం స్వల్పంగా మారినా వార్డు ఫలితాలు గణనీయంగా మారే అవకాశం ఉంది. కూటములు, స్థానిక అవగాహనలు, చివరి దశ ప్రచారం... ఇవి అన్నీ తుది ఫలితాన్ని ప్రభావితం చేస్తాయి. అనేక సందర్భాల్లో హంగ్ కౌన్సిల్స్ ఏర్పడటం కూడా మున్సిపల్ రాజకీయాల్లో సాధారణమే; తద్వారా ఎన్నికల అనంతర పొత్తులు కీలకమవుతాయి.

మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాలకు సంకేతాలుగా కూడా పరిగణించబడతాయి. పట్టణాల్లో ఏ పార్టీకి ప్రజాభిమానం పెరుగుతోందో, ఏ వర్గాలు మార్పు కోరుకుంటున్నాయో ఈ ఎన్నికలు సూచిస్తాయి. అందువల్ల ప్రధాన పార్టీలు వీటిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని వ్యూహాత్మకంగా పోరాడుతాయి. ఎన్నికల అనంతరం ఫలితాల విశ్లేషణ పార్టీలు తమ బలహీనతలను గుర్తించేందుకు, భవిష్యత్ వ్యూహాలను సవరించేందుకు ఉపయోగపడుతుంది. మొత్తంగా చూస్తే, మున్సిపల్ ఎన్నికలు స్థానిక సమస్యలు, అభివృద్ధి పనితీరు, అభ్యర్థుల వ్యక్తిత్వం, పార్టీ వ్యూహాలు, సామాజిక సమీకరణాలు... ఈ అన్నింటి సమ్మేళనం. ప్రధాన పార్టీల అవకాశాలు ఈ అంశాలను ఎంత సమర్థంగా సమన్వయం చేసుకుంటాయన్నదానిపై ఆధారపడి ఉంటాయి. ఫలితాలు ఏవైనా కావొచ్చు, పట్టణ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ప్రక్రియగా ఈ ఎన్నికలు కీలకమైన మైలురాయిగా నిలుస్తాయి. ప్రజల తీర్పు స్థానిక పాలనకు దిశానిర్దేశం చేస్తూ, భవిష్యత్ అభివృద్ధి ప్రాధాన్యతలను నిర్ధారిస్తుంది. ఇదే మున్సిపల్ ఎన్నికల అసలైన ప్రజాస్వామ్య సారాంశం.

(వ్యాసరచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)

గొప్ప భారతీయ చరిత్రకారుడు ఆర్‌సి మజుందార్

యేచన్ చంద్ర శేఖర్
8885050822

ఆచార్య రమేష్ చంద్ర మజుందార్ (ఆర్ సి మజుందార్) భారతీయ చరిత్ర రచనలో ఒక మహోన్నతమైన పేరు. ఆయన ప్రాచీన, మధ్యయుగ మరియు ఆధునిక భారత చరిత్రపై విస్తృత పరిశోధనలు చేసిన ప్రపంచ స్థాయి చరిత్రకారుడు. ఢాకా విశ్వవిద్యాలయ ఉపకులపతిగా (వైస్ ఛాన్సలర్) పనిచేశారు. నిష్పాక్షికమైన, సాక్ష్యాధారాలతో కూడిన చరిత్రను అందించడం ఆయన గొప్ప ప్రత్యేకత. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మన పూర్వీకులు జరిపిన 1857 సిపాయిల తిరుగుబాటు, భారత స్వాతంత్ర్య ఉద్యమంపై ఆయన రాసిన పుస్తకాలు అత్యంత ప్రామాణికమైనవి. 1857 నాటి సిపాయిల తిరుగుబాటును "మొదటి స్వాతంత్ర్య సంగ్రామం" అని పిలవడం కంటే "స్వాతంత్ర్యం కోసం జరిగిన మొదటి పెద్ద పోరాటం" అని ఆయన అభివర్ణించారు. ఆయనను భారత చరిత్రకారులలోని ప్రముఖులలో ఒకరిగా పరిగణిస్తారు. ఢాకా విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా సేవలందించిన సమయంలో ఆయన ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. అంతేకాదు, ఆయన చికాగో మరియు పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయాలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేసి భారత చరిత్రను ప్రపంచానికి పరిచయం చేశారు.

విస్తృతమైన పరిశోధనలు:

ప్రాచీన భారతదేశం, ప్రత్యేకించి గుప్త సామ్రాజ్యం, ఆగ్నేయాసియాలో భారతీయ సంస్కృతి ప్రభావంపై ఆయన చేసిన పరిశోధనలు అత్యంత శ్లాఘనీయమైనవి. "హిస్టరీ ఆఫ్ ది ఫ్రీడం మూవ్‌మెంట్ ఇన్ ఇండియా" ఆయన ప్రధాన రచనలలో ఒకటి. స్వతంత్ర భావాలు మెండుగా కలిగిన ఆయన అధికారిక చరిత్రను కాకుండా, సొంతంగా పరిశోధించి వాస్తవాలను వెలికితీయడం ఆయన నైజం. భారతీయ విద్యా భవన్ సహకారంతో 11 సంపుటాల బృహత్తర గ్రంథంగా వెలువడిన "ది హిస్టరీ అండ్ కల్చర్ ఆఫ్ ది ఇండియన్ పీపుల్" కు ఆయన జనరల్ ఎడిటర్‌గా వ్యవహరించారు. ఈ గ్రంథం భారతీయ సంస్కృతికి ఒక నిధిగా పరిగణించబడుతుంది. వేద కాలం నుండి స్వాతంత్ర్య సమరం వరకు భారత చరిత్రను నిష్పక్షపాతంగా, శాస్త్రీయంగా నమోదు చేసిన ఘనత ఆయనది. ప్రభుత్వ ఆమోదం పొందిన కథనాలతో ఏకీభవించడానికి నిరాకరించి, ఎటువంటి వత్తిళ్ళకు తలొగ్గకుండా, భారతదేశ స్వాతంత్ర్యంపై విమర్శనాత్మక, స్వతంత్ర వివరణలను రచించారు. ప్రాచీన కాలంలో ఆగ్నేయాసియాలో చంపా (వియత్నాం), సువర్ణద్వీప (ఇండోనేషియా), కంబోడియా వంటి దేశాల్లో భారతీయ సంస్కృతి ఎలా వ్యాపించిందో తెలియచేస్తూ ఆయన రాసిన "ఏన్షియంట్ ఇండియన్ కలనీస్ ఇన్ ది ఫార్ ఈస్ట్" లాంటి పుస్తకాలు విశేష ఖ్యాతి పొందాయి. ప్రాచీన, మధ్యయుగ మరియు ఆధునిక చరిత్ర విభాగాలన్నింటిపై ఆయనకు సమానమైన పట్టు



ఉండేది. దాదాపు 37కు పైగా పుస్తకాలు, వందలాది పరిశోధనా వ్యాసాలను ఆయన రాశారు. ఆయన రాసిన "అన్ అడ్వాన్స్‌డ్ హిస్టరీ ఆఫ్ ఇండియా" ఇప్పటికీ చరిత్ర విద్యార్థులకు ప్రామాణిక గ్రంథంగా ఉంది. మజుందార్ నిబద్ధత మరియు మేధస్సు కారణంగానే ఆయన్ను "భారతీయ చరిత్రకారుల కులపతి" (డీన్ ఆఫ్ ఇండియన్ హిస్టోరియన్స్) అని పిలుస్తారు.

వాస్తవాలను వెలికితీయడం ఆయన నైజం

1952లో, భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను అధికారికంగా సంకలనం చేయడానికి ఒక సంపాదక మండలిని నియమించింది. ఈ మండలిలో డాక్టర్ తారా చంద్ (అధ్యక్షుడు), డాక్టర్ ఆర్.సి. మజుందార్, డాక్టర్ బిశ్వేశ్వర్ ప్రసాద్, ప్రొఫెసర్ సి.ఎస్. శ్రీనివాసాచారి, డాక్టర్ ఎస్.ఎన్. సేన్ (కన్వీనర్), మరియు సహసభ్యులు శ్రీ ఆర్.ఆర్. దివాకర్ మరియు డాక్టర్ గోకల్ చంద్ నారంగ్ ఉన్నారు. అయితే, అధికారిక చరిత్రను సంకలనం చేయడం కోసం కూర్పు చేయబడిన బోర్డులో పండితులు మరియు రాజకీయ నాయకుల మిశ్రమం ఉండడం వలన అనైక్యత ఏర్పడింది. విషయానికి సంబంధించిన వివరాలను సమగ్రంగా సేకరించి ముసాయిదాను సిద్ధం చేయడానికి డాక్టర్ ఆర్.సి. మజుందార్ డైరెక్టర్‌గా నియమించబడగా, బోర్డు సభ్యుల మధ్య అభిప్రాయ బేధాలు మరియు అంతర్గత విభేదాల కారణంగా, 1955 సంవత్సరాంతంలో ఆ బోర్డు రద్దు చేయబడింది. అధికారికంగా ప్రభుత్వం ద్వారా బోర్డు రద్దు చేయబడడంతో, 1957లో ఆర్.సి. మజుందార్ తన స్వతంత్ర, విమర్శనాత్మక విశ్లేషణ అయిన "ది సిపాయ్ మ్యూటినీ అండ్ ది రివోల్ట్ ఆఫ్ 1857" గ్రంథాన్ని ప్రచురించారు. భారత స్వాతంత్రోద్యమ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయిన ఆ ఉద్యమం గురించి ఆయన ఎటువంటి శషభిషలు లేకుండా తన సొంత వృత్తాంతాన్ని అక్షరీకరించడం ఆయన వ్యక్తిత్వానికి తార్కాణం. ఆర్.సి. మజుందార్ కేవలం పుస్తకాలను చదివి ఈ విలువైన గ్రంథాలను వ్రాయలేదు. ఆయన ఆయా ప్రదేశాలను స్వయంగా సందర్శించి, అక్కడ నెలల తరబడి ఉండి, స్థానికులతో మాట్లాడి, వారి మాతృభాషలలోని శాసనాలను చదివి, అస్పష్టమైన లిపులను అర్థంచేసుకున్నారు... అది సమగ్రమైన, శ్రమతో కూడిన, పని. ఈ కారణంగానే ఆయన పుస్తకాలు ప్రామాణికమైనవిగా మారాయి మరియు భవిష్యత్ తరాల వారికి అనివార్యమైన మార్గదర్శకాలుగా నిలిచాయి.

కష్టాల కడలిలో బాల్యం:

అత్యంత పేద కుటుంబంలో జన్మించిన ఆర్ సి మజుందార్ బాల్యం కష్టాల కడలిలోనే సాగింది. కేవలం 18 నెలల వయస్సులోనే తల్లిని కోల్పోవడంతో తన తోబుట్టువులతో పాటు చిన్నమ్మ పెంపకంలో పెరిగారు. ఆ రోజుల గురించి ప్రస్తావిస్తూ తాము వరుసగా రెండు రోజులు అంత కంటే ఎక్కువ సమయం తిండి లేకుండా గడిపామని, తాను పసిపిల్లవాడిగా ఉన్నప్పుడు, ఒక రోజు రాత్రి వరదల్లో కొట్టుకుపోబోతుండగా అనుకోకుండా నిద్రలోంచి లేచిన తన చిన్నమ్మ తనను కాపాడి ఉండకపోతే ఈ రోజు నా కథ చెప్పడానికి నేను బ్రతికి ఉండేవాడిని కాను అని ఆయన ఒక సందర్భంగా తెలిపారు. అది మాత్రమే కాదు. ఆ రోజుల్లో బస్సులు గానీ, రైళ్లు గానీ ఉండకపోవడం, కనీసం రోడ్లు కూడా సరిగ్గా ఉండకపోవడంతో ఈత నేర్చుకోవడం తప్పనిసరి అయ్యేది. భారతదేశంపై ఆయనకున్న మమకారమే మన గతాన్ని పరిశోధించడానికి మరియు రెండు వేల సంవత్సరాలకు పైగా నిరంతరాయంగా మనం ప్రపంచంలోనే గొప్ప నాగరికతకు ప్రతినిధులుగా ఉన్నామని నిరూపించడానికి ఆయనను పురికొల్పింది.

(వ్యాస రచయిత మాజీ రాష్ట్ర కార్యదర్శి దిభారత్ స్కౌట్స్ & గైడ్స్, తెలంగాణ)

రాజ్యాంగ స్ఫూర్తిని చాటుదాం

కొండల్ రెడ్డి
9866514905

ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవ సందర్భంగా ఓటర్లుగా చేస్తున్న ప్రతిజ్ఞ

"భారతదేశ పౌరులమైన మేము మన దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రభావాన్ని నిలబెడతాం. మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఏ ఇతర ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నాము." కానీ ఎన్నికలలో గెలవడం కోసం అభ్యర్థులు ప్రజలను కులాల వారిగా ,మతాల వారిగా విభజించి ఓట్లు పొందాలని ప్రయత్నించడం దురదృష్టం. పౌరులు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే సరైన అభ్యర్థి ఎంపిక అవుతాడు.73 సంవత్సరాలుగా ప్రజలు పాలకులను ప్రత్యక్ష ,పరోక్ష పద్ధతిలో ఎన్నుకుంటున్నారు. ప్రజాస్వామ్యంలో పాలకులను నిర్ణయించుకునే హక్కే ఓటు హక్కు. సార్వజనిక ఓటు హక్కు ద్వారా ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి ఓటు ద్వారా ప్రభుత్వాధినేతలను ఎన్నుకునే విధానాన్ని రాజ్యాంగంలో పొందుపరిచిన సందర్భంలో డా. బి.ఆర్. అంబేద్కర్, ఆచార్య కృపలానీ మధ్య జరిగిన చర్చలో కృపలానీ వ్యాఖ్యలు గుర్తు చేసుకోవడం సందర్భోచితం."పేదలు, అసహాయులు, బలహీనులు అయిన ప్రజల నుండి ఓట్లు కొనుక్కొని ప్రభుత్వాలను మేమే ఏర్పాటు చేస్తాం" అని కృపలానీ అన్నారు. 75 సంవత్సరాల క్రితం కృపలానీ వ్యక్తీకరించింది నిజమవుతుంది. మనం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వారసులుగా కొనసాగాలనుకుంటే ప్రస్తుత పరిస్థితిని మార్చాలి.ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియలో ఇది సాధారణ అంశంగా పౌరులుగా అంగీకరించడం, భావించడం సరైనదేనా అని ఆత్మవిమర్శ చేసుకోవాలి. తాత్కాలిక ప్రయోజనాల కోసం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఇచ్చే తాయిలాలకు లొంగిపోవడం వల్ల దీర్ఘకాలిక ప్రయోజనాలు నెరవేరడం లేదు. ఎన్నికల్లో గెలవడం కోసం ఓటర్లకు మద్యం, మాంసానికి, డబ్బుకు దాసోహం అనే విధంగా మారిన ఈ పరిస్థితుల్లో ఓటర్లు మారకుండా నాయకుల ఆలోచన సరళి, పద్ధతులను మార్చలేం. ప్రతి ఎన్నికల సమయంలో ప్రజలు తమ అవసరాలను, ఆకాంక్షలను ప్రకటించడం, పోటీ పడుతున్న రాజకీయ పార్టీలు తాము అధికారంలోకి వస్తే ఏమేమి చేస్తామో ప్రణాళికల ద్వారా ప్రకటించడం ఆనవాయితీ. ప్రణాళికల్లోని వాగ్దానాలను వారు నెరవేర్చకపోయినప్పటికీ తిరిగి వారినే ఎన్నుకోవడం వల్ల ప్రజలు అమాయకులు, బలహీనులు అని మన పాలకుల భావన. ఈ పరిస్థితిని మార్చనంతకాలం యథాతథస్థితి కొనసాగుతుంది. ఈ పరిస్థితులను మార్చేది

ప్రజలు మాత్రమే. అందుకే "ప్రజలే చరిత్ర నిర్మాతలు"గా పిలువబడతారు. తెలంగాణ ప్రజాకవి కాళోజి నారాయణ రావును గుర్తు చేసుకుందాం."అభ్యర్థి ఏ పార్టీ వాడో కాదు, ఏ పాటి వాడో చూడు,ఎన్నుకుంటే ఏమి వెలగబెడతాడో కాదు,ఇప్పటి దాకా ఏం చేశాడో చూడు,పెట్టుకునే టోపీ కాదు,పెట్టిన టోపీ చూడు" అని వెలిగెత్తి చెప్పిన విషయాన్ని పోటీలో ఉన్న అభ్యర్థుల పనితనం, ప్రవర్తన, గుణగణాలను పరిశీలించి ఓటు వేసి ప్రతినిధులను ఎన్నుకోవడం ద్వారా పౌరులుగా మన బాధ్యత పూర్తి కాదు. మనం కోరుకున్న అభివృద్ధి పనులు అమలు అయ్యే వరకు ఎన్నికైన ప్రతినిధులపై నిరంతర ఒత్తిడి తీసుకురావడమే నిజమైన పౌర బాధ్యత.ఓటు వేయడం హక్కు, పనిచేయించడం బాధ్యత.

వ్యాసకర్త సిటిజన్ ఫోరం అధ్యక్షులు, టిపిటిఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

అల్పాదాయవర్గాలకు త్వరలో తీపికబురు

- పట్టణాలు, నగరాల్లో సరసమైన ధరలకే ఇళ్లు
- రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ ద్వారా ఇప్పటికే సీబీఆర్ఐ కన్సల్టెన్సీ సంస్థ ఎంపిక
- కసరత్తు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 10 : తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రజలకు అదిరిపోయే శుభవార్త అందించింది. సొంతింటి కల ప్రతీఒక్క సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఉంటుంది. దీనిని సాకారం చేసుకునేందుకు జీవితాంతం కష్టపడుతూ ఉంటారు. అయితే వీరి సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అనేక పథకాలు చేపడుతోంది. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్ రూం ఇళ్లు వంటి పథకాలను అమలు చేస్తోంది. ఈ క్రమంలో నగరాల్లో నివసించే సామాన్యులు తక్కువ ధరకే ఇళ్లు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ఇందుకోసం కొత్త పాలసీని రూపొందించనుంది. రాష్ట్రంలోని పట్టణాలు, నగరాల్లో నివసించే పేద, అల్పాదాయ, మధ్య ఆదాయ వర్గాల వారికి సరసమైన ధరలకే ఇళ్లను అందుబాటులోకి తెచ్చే (ఎఫర్డబుల్ హౌసింగ్) పాలసీని తెలంగాణ ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఈ నెలాఖరులోగా మార్గదర్శకాల ముసాయిదాను రూపొందించనున్నట్లు సమాచారం తెలుస్తోంది. ఈ మేరకు పాలసీ రూపకల్పనకు 'రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్' ద్వారా ఇప్పటికే సీబీఆర్ఐ కన్సల్టెన్సీ సంస్థను కూడా ఎంపిక చేసింది. ఇటీవల ఈ ఏజెన్సీతో గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులు సమావేశమై, హౌసింగ్ పాలసీలో ఉండాల్సిన విధి విధానాలపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. వచ్చే నెల మార్చి చివరి నాటికి తుది పాలసీని సిద్ధం చేసేలా అధికారులు ఏజెన్సీకి దిశానిర్దేశం చేశారు. దీన్ని కేబినెట్‌లో పెట్టి ఆమోదం తెలిపిన అనంతరం కొత్త ఆర్థిక సంవత్సరంలో ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని అధికారులు ఒక నిర్ణయానికి వచ్చారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2047లో భాగంగా పట్టణ ప్రాంతాల్లో పీపీపీ (పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) పద్ధతిలో ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి రకరకాల ఏర్పాట్లు చేస్తున్నారు. అలా నిర్మించిన భవనాలను మధ్యతరగతి ప్రజలకు అందించాలని నిర్ణయం తీసుకున్నారు.

మూడు దశల్లో నిర్మించే విధంగా ప్రణాళికలు

మొత్తం మూడు దశల్లో ఈ ఇళ్ల సముదాయాలను నిర్మించే విధంగా ప్రణాళికలు చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం ఉన్న మురికివాడల్లోనే బహుళ అంతస్తుల భవనాలను నిర్మించి, ఆయా వర్గాల ప్రజలకు అందించాలని తెలంగాణ సర్కారు భావిస్తోంది. భారత్ ఫ్యూచర్ సిటీలోనూ పెద్ద ఎత్తున గృహ సముదాయాల నిర్మాణాన్ని చేపట్టనుందని సమాచారం. రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి పట్టణాల్లోనూ ఇళ్ల టవర్లను ఏర్పాటు చేసేలా పలు రకాల మార్గదర్శకాలను రూపొందిస్తోంది. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్ పూర్వ జిల్లాల పరిధిలో గృహ నిర్మాణ శాఖ ఇప్పటికే స్థలాలను కూడా గుర్తించింది. రాబోయే ఐదు సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా సరసమైన ధరల (అఫర్డ్‌బుల్ హౌసింగ్) నివాసాల అవసరం 3 కోట్ల వరకు ఏర్పడనుంది. పేద, అల్పాదాయ, మధ్య ఆదాయ వర్గాల నుంచి ఎక్కువగా డిమాండ్ కనిపిస్తోంది. ఆర్థికంగా వెనకబడిన వర్గాల నుంచి (ఈడబ్ల్యూఎస్) 46 శాతం, అల్పాదాయ వర్గాలు 33 శాతం, మధ్య ఆదాయ వర్గాలు (ఎంఐజీ) 16 శాతం, అధిక ఆదాయం వర్గాల నుంచి 5 శాతం డిమాండ్ ఉందని నరెడ్కోనైట్ ఫ్రాంక్ ఇండియా అనే సంస్థ విడుదల చేసిన నివేదిక ద్వారా తెలుస్తోంది. ఇళ్ల ధరలు ఇటీవల కాలంలో భారీగా పలుకుతున్నాయి. ఈ ప్రభావం అందుబాటు ధరల్లో ఉండే నివాసాలపై పడింది. వీటి బడ్జెట్ సైతం ప్రస్తుతం గణనీయంగా పెరిగింది. దీంతో కొనడం ఈడబ్ల్యూఎస్, ఇతర అల్పాదాయ వర్గాలకు తీవ్రమైన కష్టంగా మారింది. హోమ్ లోన్ తీసుకుని కొందామన్నా కుటుంబానికి వచ్చే ఆదాయానికి, నెలవారీ చెల్లించే ఈఎంఐకి సరైన పొంతన కుదరడం లేదు. వచ్చేదేమో గోరంత పోయేదేమో కొండంతలా ఉంది. ఈ క్రమంలో స్థోమత చాలక సొంతింటి కల నిజం చేసుకునేందుకు ఆయా వర్గాలు అష్టకష్టాలు పడుతున్నాయి.

ప్రశాంత ఎన్నికల నిర్వాహణే లక్ష్యం

- 11 వందల మంది సిబ్బందితో ప్రత్యేక బందోబస్త్ ఏర్పాట్లు
- ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛ ఓటు హక్కును వినియోగించుకోవాలి
- ఎన్నికల ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు
- మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని కఠినంగా అమలు
- కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి ఫిబ్రవరి 10 : ఈ నెల 11వ తేదీన సంగారెడ్డి జిల్లాలోని 8 మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగనున్నాయని, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట భద్రత చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా ఎస్పీ పరితోష్‌పంకజ్ తెలిపారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛయుత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అదనపు.ఎస్పీ, డిస్పీల ఆధ్వర్యంలో ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలు అప్రమత్తంగా పని చేస్తుయన్నారు. జిల్లా ప్రజలు ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలని, ఆయా మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రవర్తన నియమావళి కఠినంగా అమలు చేయడం జరుగుతుంది అన్నారు. 8 మున్సిపాలిటీలలో 199వార్డులకు గానూ 153కేంద్రాలు, 453పోలింగ్ స్టేషన్స్ లలో ఎన్నికలు జరగనున్నాయని అన్నారు. ఇందులో 59సమస్యాత్మక పోలింగ్ స్టేషన్స్ గుర్తించడం జరిగిందన్నారు. పోలింగ్ రోజు ఎన్నికల సరళికై జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎలక్షన్ సెల్ ద్వారా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. బందోబస్తు నిర్వహణ మొదలుకుని ఎన్నికల సామాగ్రికి, ఎన్నికల సిబ్బందికి భద్రత కల్పించే వరకు ప్రతి అంశాన్ని ప్రణాళికబద్ధంగా పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. అలాగే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించడం జరిగిందని ఈ సీసీ కెమెరాలను జిల్లా పోలీస్ కార్యాలయం నుండి నిత్యం పర్యవేక్షణ చేయడం జరుగుతుంది. ఎన్నికల ప్రక్రియ పూర్తి సిసి కెమెరాల నిఘాలో ఉన్నదన్నారు. ఎన్నికల ప్రచార సమయం ముగిశాక అభ్యర్థులు ఎవరు కూడా ప్రచారం నిర్వహించకూడదని, నిబంధనలు ఉల్లంఘించి ప్రచారం నిర్వహిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, కేసులు నమోదైతే అభ్యర్థిత్వం కోల్పోతారని తెలిపారు. సోమవారం సా.5 గంటల నుండి ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు సైలెన్స్ డే గా పరిగణించడం జరుగుతుందని ఈ సమయంలో ఓటర్లు కాని వారు అనగా స్థానికేతరులు కాలనీలు వార్డులో సంచరించరాదని హెచ్చరించారు. ఓటర్ల మనసు గెలిచి ఎన్నికల బరిలో గెలవాలి అన్నారు అంతేకానీ ఉచితాలు, బహుమతులు, డబ్బు మద్యం లాంటి వాటితో ఓటర్లను ప్రలోభాలకు గురిచెయొద్దని, అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడినా, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి, 123 కేసులు నమోదు చేసి, 208 మందిని సత్ప్రవర్తన కోరుతూ ముందస్తుగా బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎన్నికలను ప్రభావితం చేసే మద్యం అక్రమ రావాణాపై 30 కేసుల్లో రూ.1.57 లక్షల విలువైన 249 లీటర్ల మద్యం సీజ్ చేశామని అన్నారు.

అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 10 : బీజేపీ ప్రభుత్వం అమెరికాకు లొంగిపోయి ఏకపక్షంగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ హైదరాబాద్ గోల్కొండ క్రాస్ రోడ్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మోడీ, ట్రంప్ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు మాట్లాడుతూ ఈ నెల 12న జరుగు దేశ వ్యాపిత సమ్మెలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులతో పాటు విద్యార్థులు, యువజనలు, మహిళలు, మేధావులు, సామాజిక తరగతులు భాగస్వాములు కావాలని కోరారు. ఒకవైపు ఆత్మనిర్భర భారత్ గురించి చెబుతూనే మరోవైపు భారత దేశంలోకి వచ్చే వస్తువులపై సుంకాలను పూర్తిగా తొలగించడం ఈ దేశ కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజల జీవితాలను విదేశీ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడమేనని అన్నారు. ఈ ఒప్పందం అమలు అయితే అమెరికా నుండి మొక్కజొన్న, పత్తి, సోయాబీన్ తదితర పంటలు, పాలు, పాల పదార్థాలు ఎలాంటి దిగుమతి సుంకాలు లేకుండా పెద్ద ఎత్తున మన దేశంలోకి దిగుమతి అవుతాయి. 65% జనాభా ఆధారపడి ఉన్న మన వ్యవసాయ రంగం దివాళా తీస్తుందని, మన దేశం నుండి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువుల పైన 18 శాతం పన్నులు అమెరికా విధిస్తుందని, మనదేశంలోకి దిగుమతులు ఇబ్బడి ముబ్బడిగా వస్తాయని అన్నారు. ఈ విధానాలకు నిరసనగా గ్రామ గ్రామాన నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మలు దహనం చేయాలని, లేబర్ కోడ్లు రద్దు చేయాలని కోరుతూ కార్మిక వర్గం నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను గ్రామ, గ్రామాన నిరసన ప్రదర్శనలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షులు యస్ వీరయ్య, ఈశ్వరరావు, ఎస్వి రమ, సీఐటీయూ నాయకులు ప్రసాద్, సోమన్న, ఎం శ్రీనివాస్, ఎం. వెంకటేష్, కుమార్, దశరథ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బొప్పని పద్మ, నాయకులు ఆర్ ఆంజనేయులు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కట్టా నరసింహ తదితరులు పాల్గొన్నారు.

1,511 కోట్ల విలువైన భూమికి హైడ్రా ఫెన్సింగ్

- ఆక్రమణలపై నగరం నలువైపులా హైడ్రా చర్యలు
- కొండాపూర్‌లో 4 ఎకరాల చెరువును కాపాడిన హైడ్రా
- అల్వాల్ కొత్త చెరువు ఆక్రమణలు తొలగింపు
- రాధాకృష్ణ నగర్‌లో 450 గజాల పార్కును కాపాడిన హైడ్రా
- జక్కిడి కాలనీలో 650 గజాల పార్కుకు ఫెన్సింగ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 10: ఆక్రమణలను హైడ్రా సీరియస్‌గా పరిగణిస్తోంది. పార్కులు, చెరువులను చెరపట్టిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తోంది. మంగళవారం ఒకే రోజు నగరం నలువైపులా 4 చోట్ల భారీ ఆపరేషన్ నిర్వహించి ఆక్రమణలు తొలగించింది. వెను వెంటనే ఫెన్సింగ్ వేసింది. రెండు చోట్ల 1100ల గజాల మేర ఉన్నపార్కులను కాపాడగా, మరో రెండు ప్రాంతాల్లో 12 ఎకరాలు (జంగం కుంట 4 ఎకరాలు, అల్వాల్ కొత్త చెరువు 8 ఎకరాలు) మేర చెరువుల ఎఫ్‌టీఎల్ ప్రాంతాలను హైడ్రా రక్షించింది. ఇలా కాపాడిన భూమి విలువ సుమారుగా రూ. 1,511ల కోట్ల వరకూ ఉంటుందని అంచనా.

కొండాపూర్‌లో చెరువును కాపాడిన హైడ్రా

శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం మదీనాగూడ రోడ్డు మార్గం కొండాపూర్‌లో రూ. 700 కోట్ల విలువైన భూమిని హైడ్రా మంగళవారం కాపాడింది. 4 ఎకరాల జంగం కుంటను పూడ్చేసి, మట్టితో చదును చేసి ప్లాట్లుగా విక్రయించేందుకు సిద్ధమైన కబ్జాదారుల ఆట కట్టించింది. ఇటీవల మీడియాలో వచ్చిన కథనాల మేరకు రెవెన్యూ అధికారులతో హైడ్రా జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసింది. జంగం కుంటగా హైడ్రా నిర్ధారించుకుంది. కబ్జా చేసిన వారిపై రెవెన్యూ అధికారులు కేసులు కూడా పెట్టారు. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాల మేరకు మంగళవారం ఫెన్సింగ్ వేసింది.

అల్వాల్ కొత్త చెరువులో..

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలంలోని అల్వాల్ కొత్త చెరువు 8 ఎకరాల మేర ఆక్రమణలను హైడ్రా తొలగించింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్లాస్టిక్ కంప్రెసివ్ యూనిట్, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కార్యకలాపాలు నిర్వహిస్తూ చెరువును కలుషితం చేస్తున్నారని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే అక్కడ పని వారికోసం తాత్కాలిక షెడ్డులు వేసి వ్యర్థాలన్నీ చెరువులోకి వదులుతున్నారని పేర్కొన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని టెంటు సామగ్రికి చెందిన 4 షట్టర్లు కూడా వేసినట్టు ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చెరువు ఆక్రమణలను నిర్ధారించుకున్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి కట్టడాలు, నిర్మాణాలు చేయరాదనే నిబంధన పట్టకుండా ఏర్పాటు చేసిన షెడ్డులను హైడ్రా తొలగించింది.

1100 గజాల పార్కులు..

రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం సాహేబ్‌నగర్ కలాన్‌లోని జక్కిడినగర్ కాలనీలో 650గజాల పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. సర్వే నంబరు 132, 133లో 1982లో 12 ఎకరాల మేర దాదాపు 161ప్లాట్లతో జక్కిడి కుటుంబ సభ్యులు లే ఔట్ వేశారు. ఇందులో 650 మేర పార్కుకోసం కేటాయించారు. 1985 లోనే దీనిని ప్లాట్లుగా చేసి లే ఔట్ వేసిన వారే అమ్మేశారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ప్రహరీతో పాటు.. రెండు షెడ్డులు నిర్మించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో హైడ్రా పరిశీలించి పార్కు స్థలంగా నిర్ధారించుకుంది. ఈ మేరకు మంగళవారం ఆక్రమణలు తొలగించి.. పార్కు చుట్టూ ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. మల్కాజిగిరి జోన్, మౌలాలి సర్కిల్ పరిధిలోని కాకతీయ నగర్‌లో రాధాకృష్ణ హౌసింగ్ కాలనీలో 450 గజాల పార్కును హైడ్రా కాపాడింది. జీహెచ్ ఎంసీకి గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చిన ఈ పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన ప్రహరీతో పాటు.. రేకుల షెడ్డును హైడ్రా మంగళవారం తొలగించింది.

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళకు

మెడికవర్ వైద్యుల అరుదైన శస్త్రచికిత్స

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 10 : రోడ్డు ప్రమాదాల సమయంలో మొదటి గంట (గోల్డెన్ అవర్) అత్యంత కీలకమని, సరైన సమయంలో ఆసుపత్రికి చేరి చికిత్స పొందితే ఎంతటి తీవ్రమైన గాయాల నుంచైనా రోగిని రక్షించవచ్చని డా. ముడవత్ శశి వర్ధన్, కన్సల్టెంట్ ట్రామా & జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, మెడికవర్ హాస్పిటల్స్ వారు తెలిపారు. ఈ కేసులో అన్ని విభాగాల వైద్యులు సమన్వయంతో పనిచేయడం వల్లే రోగిణి ప్రాణాలు దక్కాయని ఆయన పేర్కొన్నారు. ఇస్నాపూర్ ప్రాంతంలో రోడ్డు దాటుతుండగా భారీ వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతి అంచునకు చేరిన 58 ఏళ్ల మహిళకు మెడికవర్ హాస్పిటల్స్, చందానగర్‌లోని వైద్యులు సమయానికి చికిత్స అందించి విజయవంతంగా ప్రాణాలను కాపాడారు. ప్రమాదంలో ఆమెకు ఛాతీకి తీవ్రమైన దెబ్బ తగిలి పక్క ఎముకలు విరగడం, ఊపిరితిత్తులకు గాయం, పొట్టలోని ప్లీహం (స్ప్లీన్) చీలిపోవడం, నడుము భాగంలోని ఎముకలు అలాగే కుడి తొడ మరియు కాలి ఎముకలు తీవ్రంగా విరగడం వంటి అనేక ప్రమాదకర గాయాలు అయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఆమెను అత్యవసర స్థితిలో మెడికవర్ హాస్పిటల్స్‌కు తరలించారు. ఆసుపత్రికి చేరుకునే సమయంలో రోగిణి పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో, వైద్యులు వెంటనే ఆమెను ఐసీయూలో చేర్చి చికిత్స ప్రారంభించారు. పొట్టలో తీవ్రమైన అంతర్గత రక్తస్రావం జరుగుతున్నట్లు గుర్తించిన వైద్యులు ప్రాణాలను కాపాడేందుకు అత్యవసరంగా శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ శస్త్రచికిత్సను డా. బర్ది సాయి దిలీప్, కన్సల్టెంట్ జనరల్, లేజర్ & లాపరాస్కోపిక్ సర్జన్ విజయవంతంగా నిర్వహించగా, అనస్థీషియా మరియు నొప్పి నియంత్రణ బాధ్యతలను డా. శ్వేత రాపోలు, కన్సల్టెంట్ అనస్థీషియాలజిస్ట్ & ఇంటర్వెన్షనల్ పెయిన్ ఫిజీషియన్ సమర్థవంతంగా నిర్వహించారు. శస్త్రచికిత్సలో భాగంగా దెబ్బతిన్న ప్లీహాన్ని తొలగించారు. అనంతరం విరిగిన కుడి తొడ మరియు కాలి ఎముకలకు ఆధునిక శస్త్రచికిత్సల ద్వారా రాడ్లు, ప్లేట్లు అమర్చారు. చికిత్స మొత్తం సమయంలో ఐసీయూలో రోగిణిని నిరంతరం పర్యవేక్షిస్తూ డా. రాజు సికిలమ్మెట్ల, కన్సల్టెంట్ ఇంటెన్సివిస్ట్ ఆధ్వర్యంలో క్రిటికల్ కేర్ బృందం కీలక సేవలు అందించింది. కొన్ని రోజుల పాటు వెంటిలేటర్ మరియు ఆక్సిజన్ సహాయంతో చికిత్స పొందిన రోగిణి క్రమంగా కోలుకుని, ప్రస్తుతం మాట్లాడే స్థితిలో పూర్తిగా స్థిరమైన ఆరోగ్యంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. మెడికవర్ హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉన్న ఆధునిక అత్యవసర మరియు ట్రామా వైద్య సదుపాయాలు, అనుభవజ్ఞులైన బహుశాఖ వైద్య బృందం కారణంగా ఇలాంటి అత్యంత క్లిష్టమైన రోడ్డు ప్రమాద కేసుల్లోనూ విజయవంతమైన చికిత్స సాధ్యమవుతోందని హాస్పిటల్ యాజమాన్యం లిపింది.

మున్సిపల్ ఎన్నికల్లో కట్టుదిట్టమైన భద్రత

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 10 : ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో రేపు జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు ఏర్పాటు చేస్తున్నట్లు సైబరాబాద్ సీపీ రమేష్ రెడ్డి గారు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఇస్నాపూర్లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొత్తం 314 మంది సిబ్బంది, ఇద్దరు డీసీపీ లు, ఇద్దరు ఏసీపీలు, 9 మంది సీఐలు, 24 మంది ఎస్ ఐలు, సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేర్లింగంపల్లి జోన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్, రామచంద్రపురం ఏసిపి శ్రీనివాస్ కుమార్, పఠాన్ చేరు ఎస్ హెచ్ ఓ వినాయక్ రెడ్డి , డి ఐ. రాజు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్లకు కనీస వేతనం 9వేలు ఇవ్వాలి

- పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారాయణరెడ్డి
- భవిష్య నిధి ప్రాంతీయ కార్యాలయం ముందు పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ధర్నా, వినతి పత్రం అందజేత.

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 10 : పెన్షనర్లకు కనీస వేతనం తొమ్మిది వేలు ఇవ్వాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారాయణరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అల్ ఇండియా యునైటెడ్ యాక్షన్ కమిటీ అఫ్ ఈపి ఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఏఐయు ఏసి ఈపిఎ) కమిటీ మరియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పోరాట ఎజెండా లో భాగంగా, టిఏపీ ఆర్ పిఏ జిల్లా కమిటీ మూడు రోజుల ధర్నా కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు జిల్లా కమిటీ సభ్యులతో పాటు ఈపిఎఫ్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో మంగళవారం పటాన్ చెరు పట్టణంలోని భవిష్య నిధి ప్రాంతీయ కార్యాలయం ముందు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ధర్నా నిర్వహించారు అనంతరం భవిష్యనిది ప్రాంతీయ కార్యాలయం ఉప కమిషనర్ సురేంద్ర రావు కు వినతి పత్రం అందజేశారు. అనంతరం పెన్షనర్స్ ఉద్దేసించి రాష్ట్ర అధ్యక్షులు నారాయణ రెడ్డి మాట్లాడుతూ లక్షలాది ఈపీఎఫ్ పెన్షనర్లకు గౌరవప్రదమైన పెన్షన్ ప్రయోజనాన్ని కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పెన్షనర్ల కుటుంబాలు కనీస అవసరాలు తీరక అత్యంత దయనీయ బతుకులు వెల్లదీస్తున్నారని వాపోయారు. పెన్షనర్లు చేస్తున్న విజ్ఞప్తులు, ధర్నాలు, ఉద్యమాలు, ఆందోళనలు కేంద్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆలోచించి పెన్షన్ల హింస వేతనం పెంచాలని లేనిపక్షంలో దేశవ్యాప్త ఉద్యమాలు చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. టిఏపీ ఆర్ పిఎ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రామారావు, జిల్లా వైస్ ప్రెసిడెంట్స్ జె. వెంకటరెడ్డి,ఎం. దేవేంద్రా చారి, ఎం సత్యన్నారాయణ పాటి,సెక్రటరీస్ బి ఎల్ నాయుడు,టి ప్రభాకరరావు, సీనియర్ పెన్షనర్ లు తదితరులు పాల్గొన్నారు.

"

యూఎస్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందం 'ట్రాప్ డీల్'. రష్యా నుంచి చమురు నిలిపివేయాలన్న షరతుకు ఒప్పుకోవడం భారత్ తన సార్వభౌమాధికారాన్ని కోల్పోవడమే. జనెటికల్లీ మాడిఫైడ్‌ఫీడ్, పప్పు ధాన్యాల దిగుమతులకు అంగీకరించడం రైతులకు జరిగే తీరని అన్యాయం. దుస్తుల ఎగుమతుల్లోనూ భారత్ కంటే బంగ్లాకే ఎక్కువ ప్రయోజనం చేకూరేలా ఈ ఒప్పందం ఉంది.

- ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే

ప్రాంతీయం

డిస్ట్రిబ్యూషన్ సెంటర్ సందర్శించిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి10: మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం జిల్లా కేంద్రంలోని వెస్లీ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ మంగళవారం సందర్శించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్ళను సైతం పరిశీలించిన కలెక్టర్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఒక్క సెకను కూడా విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, సకాలంలో ఓట్ల లెక్కింపు పూర్తి చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో దివ్యాంగులకు ర్యాంపులు, వీల్ చైర్లు అందుబాటులో ఉండాలన్నారు. సదుపాయాల కల్పన విషయమై అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు అందుబాటులో ఉండాలని, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని అన్నారు. అనవసర తప్పిదాలకు తావిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అప్రమత్తతో ఎన్నికల విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి , తహసిల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ,జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రత

- మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి10 : మెదక్ జిల్లా పరిధిలో జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. మంగళవారం మెదక్ టౌన్ కేంద్రంలోని వేస్లీ కాలేజీ ప్రాంగణంలో మున్సిపల్ ఎన్నికల బందోబస్తు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందికి ఆయన స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో క్రమశిక్షణగా విధులు నిర్వహించాలని సూచించారు.ఉదయం ప్రారంభం నుంచే ప్రతి పోలీసు సిబ్బంది తమ డ్యూటీ పోస్టులకు హాజరై, ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి, వారికి అవసరమైన సహకారం అందించాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ ప్రాంతంలో ప్రచార సామగ్రి, పార్టీ చిహ్నాలు, మొబైల్ ఫోన్లు తీసుకురావడం నిషేధమని స్పష్టం చేశారు. పోలింగ్ బూత్‌లో సెల్ఫీలు దిగడంపై పూర్తిస్థాయి నిషేధం ఉంటుందని తెలిపారు. ఎన్నికల సమయంలో మద్యం, డబ్బుల పంపిణీ, ఓటర్లపై ఒత్తిడి, తప్పుడు ప్రచారాలు నిర్వహించిన వారిపై ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎన్నికలు జరుగుతున్న మున్సిపాలిటీల పరిధిలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమల్లో ఉంటుందని, దీని ప్రకారం నలుగురికి మించి గుంపులుగా గుమికూడరాదని తెలిపారు. ఏదైనా అనుమానాస్పద చర్యలు గమనించినట్లయితే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి జిల్లా ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

- ఆకునూరు సర్పంచ్ కొమ్ము రవి, చేర్యాల విద్యుత్ ఏఈ కనకయ్య

ప్రతిపక్షం చేర్యాల, జనవరి 10: చేర్యాల మండల పరిధిలోని మేజర్ పంచాయతీ ఆకునూరు గ్రామంలో నాణ్యమైన విద్యుత్ ను అందించడమే ప్రజా బాట లక్ష్యమని ఆకునూరు గ్రామ సర్పంచ్ కొమ్ము రవి, చేర్యాల విద్యుత్ రూరల్ ఏఈ కనకయ్య అన్నారు. మంగళవారం ఆకునూరులో నిర్వహించిన ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా పలు విద్యుత్ నియంత్రికలు, స్తంభాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో విద్యుత్ కు అంతరాయం లేకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో తమ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యుత్ సమస్యలను తెలుసుకుంటారన్నారు. వెంటనే స్పందించి లోల్టేజ్ లో భాగంగా బీసీ కాలనీ, ఖచ్చిరు వద్ద 25కేవీ రెండు నియంత్రికలు ఏర్పాటు చేసి లోల్టేజ్ సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ కర్నాల సంపత్, ఉప సర్పంచ్ కడారి పల్లవి భాస్కర్, వార్డు సభ్యులు నూనె శేఖర్, ఎండి హైమద్, జూపల్లి కార్తీక్ రెడ్డి, అందె లక్ష్మి, సూర అనిత, తాడికొండ శేఖర్ యాదవ్, భూమని భాస్కర్, సుంచు హేమ, గణపురం బాల నర్సమ్మ, మంతపురి భాగ్యలక్ష్మి, గ్రామస్తులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

12న జరుగు దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలి

- భవన నిర్మాణ కార్మిక సంఘాల పిలుపు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 10: ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు సమ్మె విజయవంతానికి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిద్దిపేట జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘాల ఐక్య కార్యచరణ నాయకులు బిల్డింగ్ కనెక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్, బిఎన్ఆర్కేఎస్ జిల్లా అధ్యక్షులు దూబల శ్రీశైలం,భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బెక్కంటి సంపత్ పిలుపునిచ్చారు. మంగళవారం భవన నిర్మాణం కార్మిక సంఘాల సంయుక్త సమావేశం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజలు, కార్మికుల హక్కులను కాలరాయటమే కాక రాష్ట్ర హక్కులను హరిస్తూ చట్టాలను చేసింది. అత్యంత ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్లు అమలు, విద్యుత్ సవరణ బిల్లు 2025, విత్తన బిల్లు, విబిజి రామ్ జీ చట్టం, బీమా రంగంలోకి 100% విదేశీ పెట్టుబడులకు అనుమతి, అణు రంగంలోకి ప్రైవేటు కంపెనీలకు అనుమతిస్తూ అణు చట్టం చేసింది. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలతో పాటు, భవన నిర్మాణ కార్మికుల 1996 కేంద్ర చట్టం, 1979 అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టాలను రద్దు చేసింది. వీటికి వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు, రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు 2026 ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె చేయాలని పిలుపునిచ్చాయి. సమ్మెలో భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నామన్నారు.

హిందూ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలి

- ఎల్లమ్మ దేవి ఆలయంలో మహిళలతో కలిసి బోనం ఎత్తున అర్బన్ ఎమ్మెల్యే

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 10 : హిందూ సంప్రదాయం, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. నిజామాబాద్ నగరంలోని ఎల్లమ్మ గుట్ట శ్రీ ఎల్లమ్మ దేవి ఆలయములో మంగళవారం నిర్వహించిన ఏకాదశ వార్షికోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మంగళవారం ఎల్లమ్మ గుట్టలోని ఎల్లమ్మ దేవి ఆలయంలో బోనాల పండుగను పురస్కరించుకుని అమ్మవారి ఆలయం నుండి బోనాలు తీశారు. ఈ బోనాల కార్యక్రమంలో ఎమ్మెల్యే బోనం ఎత్తుకొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణలు, పంచయాగ కార్యక్రమాలు భక్తుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజలను ఐక్యపరుస్తాయని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ గుట్టలో గల ఎల్లమ్మ దేవికి ఎంతో ఆధ్యాత్మిక విశిష్టత ఉందని ఆయన అన్నారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా భక్తుల కొంగు బంగారంగా అమ్మవారు కోరికలను నెరవేరుస్తారని ప్రజల్లో నమ్మకం ఉందన్నారు. ఎల్లమ్మ దేవి ఆశీస్సులతో నగరం సుభిక్షంగా ఉండి జిల్లా, ముఖ్యంగా అర్బన్ నియోజకవర్గ ప్రజలకు ఆయురారోగ్యాలు ప్రసాదించి అమ్మవారు ఆశీస్సులు ఉండి ప్రజలు ప్రశాంతంగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. నిజామాబాద్ నగరంలో ఆలయాల అభివృద్ధి, సంప్రదాయ ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం మరియు ప్రజాప్రతినిధులు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. ఎల్లమ్మ దేవి ఆలయం భక్తుల విశ్వాస కేంద్రంగా మారిందని, ఇటువంటి వార్షికోత్సవాలు యువతకు సంస్కృతి విలువలను తెలియజేస్తాయని అన్నారు. ఎల్లమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని, నగర అభివృద్ధే తన ధ్యేయమని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బొబ్బిలి మోహన్, ప్రధాన కార్యదర్శి ఉల్లేంగ నాగరాజు, బొబ్బిలి వేణు, న్యాలం రాజు, దంతుల రవి,ఉపాధ్యక్షులు పంచరెడ్డి సంతోష్, ఉప కార్యదర్శి నైయినోళ్ళ వేంకటేశం, యెండల లక్ష్మణ్, పంచరెడ్డి సాయిలు, బొబ్బిలి మనోహర్ తో పాటు మున్నూరు కాపు సంఘం సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే ఎల్లమ్మ గుట్ట, బొబ్బిలి వీధి పరిసర ప్రాంతాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు హృదయ పూర్వక స్వాగతం పలికారు.

సెంచరీతో కదం తొక్కిన గజ్వేల్ బుడత

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 10: సంగారెడ్డిలో జరుగుతున్న అండర్ 19 ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్ లో గజ్వేల్ కు చెందిన బాకీ ఇశాంత్ మంగళవారం నాడు మెదక్ జిల్లా, ఖమ్మం జిల్లా మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ లో 117 బంతుల్లో 106 రన్ చేసి శభాష్ అనిపించుకున్నారు. అలాగే మెదక్ వర్సెస్ మహబూబ్ నగర్ తో జరిగిన మ్యాచ్ లో 64 రన్స్ చేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా గజ్వేల్ క్రీడాకారులు మాట్లాడుతూ బాకీ హిషాంత్ క్రికెట్ లో రాణిస్తూ గజ్వేల్ పేరును నిలబెడుతూ క్రికెట్ లో చక్కని ప్రతిభ కనబరుస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు.

డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

ప్రతిపక్షం, దుబ్బాక, ఫిబ్రవరి 10: మున్సిపల్ ఎన్నికలు 2026 ప్రక్రియలో భాగంగా మంగళవారం దుబ్బాక మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి లచ్చపేట లోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల లో పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి , జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు అయేషా మస్రత్ ఖానం తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ... పోలింగ్ సిబ్బంది మీకు అందజేసిన పోలింగ్ సామాగ్రిని అన్ని చెక్ చేసుకోవాలని బ్యాలెట్ పేపర్ కౌంట్ చేసుకోవాలని తెలిపారు. అలాగే బ్యాలెట్ బాక్స్ ఉపయోగించే విధానం తో పాటు లాక్ వేయడం, అన్ లాక్ ప్రక్రియ గూర్చి ఎలాంటి సమస్యలు ఉన్న పరిష్కరించుకోవాలని సూచించారు.మీ రూట్ లో పోలింగ్ స్టేషన్ కి వెళ్ళక ఎలక్షన్ కమిషన్ నియమావళి ప్రకారం పోలింగ్ ప్రక్రియకు ఫర్నిచర్,లైటింగ్, బూత్ ఏర్పాటు పోలింగ్ సరళి సహావుగ జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. అనంతరం మోడల్ స్కూల్ లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్ను, స్ట్రాంగ్ రూమ్ ను పరిశీలించారు. ఎలక్షన్ కమిషన్ నియమావళి ప్రకారం కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా ఏర్పాట్లు చెయ్యాలని మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట ఎంపిడిఓ భాస్కర శర్మ, తహసిల్దార్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ ఓటు రామ రాజ్యానికి బాట

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 10: నేడు జరిగే మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ గజ్వేల్ రామకోటి సంస్థ వినూతన ఆలోచనకు శ్రీకారం చుట్టి ఓటు వేసే ఈవీఎం చిత్రాన్ని బియ్యంతో రూపొందించి కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకోటి భక్త సమాజం జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు మాట్లాడుతూ ఓటు సామాన్యుని చేతిలో ఆయుధం అన్నారు. నిజాయితీగా రాజకీయ తలరాతను రాసే హక్కు మన ఓటుకు ఉందన్నారు.

ఎన్నికల్లో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- అదనపు ఎస్పీ మహేందర్

ప్రతిపక్షం, చేగుంట, ఫిబ్రవరి 10: మున్సిపల్ ఎన్నికల సందర్భంగా విధుల్లో పాల్గొనే పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పి మహేందర్ అన్నారు. తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని నోబెల్ ఫార్మసీ కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. శాంతి భద్రతలకు విఘాతం కలవకుండా సమిష్టి కృషితో పని చేయవలసిన అవసరం ఉందన్నారు. ఓటర్లు మాత్రమే క్రమసంఖ్యలో ఉండాలని సూచించారు. ఇతరులను పోలింగ్ కేంద్రాల పరిసరా పరిసరాల్లోకి రానివ్వ వద్దన్నారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో ఉండాలని సూచించారు . ఓటు వేసే సమయంలో సెల్ఫోన్లను అనుమతించరాదని అదనపు ఎస్పీ మహేందర్ సిబ్బందికి వివరించారు . ఈ సమావేశంలో తూప్రాన్ ఆర్ డి ఓ జయచంద్రరెడ్డి జడ్పీ సీఈఓ ఎల్లయ్య తూప్రాన్ సిఐ రంగాకృష్ణ పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

ఘనంగా రేణుక మాత ఎల్లమ్మ బోనాలు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 10: కౌండిన్యుల ఆరాధ్య దైవమైన శ్రీ రేణుకా మాత (ఎల్లమ్మ) ఆశీస్సులు ఎల్లప్పుడు అందరికి ఉండాలని మంగళవారం మెదక్ పట్టణశివారులో పడుపులేరు ఒడ్డున వెలసిన శ్రీ రేణుక మాత ఆలయ 32వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయలకు అనుగుణంగా పసుపు కుంకుమలతో అందంగా అలంకరించిన బోనాలను తయారు చేసి మహిళలు నూతన వస్త్రాలు దరించిన నెత్తిన పెట్టుకుని ప్రధాన వీదుల గుండా ఊరేగించారు. ఈ బోనాలు ఉరేగింపులో కోలాటం, పోతరాజుల,శివ సత్తుల విన్యాసాలు, యువకుల నృత్యాలు. శివసత్తుల పూనకాలు డబ్బు వాయిద్యాల మధ్య పుర వీదుల గుండా తరులుతు యువకుల కేరింతల మధ్య అంగరంగ వైభవంగా బోనాలను అమ్మవారికి సమర్పిం చారు. ఉదయం నుండే అమ్మవారికి మహిళలు ఒడిబియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు మంగ రాజగౌడ్, ఆలయ చైర్మన్ అరేళ్ళ విద్యాదర్ గౌడ్,ఆరేళ్ళ జనార్దన్ గౌడ్, కృష్ణ గౌడ్. కుమార్ గౌడ్, మంగ అశోక్ గౌడ్, నర్సింలు గౌడ్,యాదగిరి గౌడ్, మంగ నారాగౌడ్, శంకర్ గౌడ్, లక్ష్మీనారా యణ గౌడ్, సత్యం గౌడ్ దామోదర్ గౌడ్ ఉన్నారు.

“ నాంపల్లి అగ్నిప్రమాదంపై విచారణ జరుగుతోంది. ఓటుకు నోటు కేసు ఫైల్స్ తగలబడ్డాయనేది అవాస్తవం. ఆ కేసు ఫైల్స్‌ను 2021లోనే కోర్టుకు అందజేశాం. ఫోన్ ట్యాపింగ్ కేసు రిపోర్టులూ ఇచ్చాం. హైదరాబాద్‌మినహా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ప్రచార సమయంలో ₹3.09Cr పట్టుబడ్డాయి. మక్తల్ బీజేపీ అభ్యర్థి ఆత్మహత్యపై కేసు నమోదు చేశాం.

- డీజీపీ శివధర్ రెడ్డి

ప్రాంతీయం

ఎన్నికల విధులు

స్వేచ్ఛాయుతంగా నిర్వర్తించాలి

- మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీదేవి

ప్రతిపక్షం,సంగారెడ్డి ప్రతినిధి , ఫిబ్రవరి 10 : మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో సంగారెడ్డి ,ఇస్నాపూర్ మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను మంగళవారం తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ టి.కె. శ్రీదేవి పరిశీలించారు . ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరును కమిషనర్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు . ఈ సందర్భముగా కమిషనర్ మాట్లాడుతూ ...ఎన్నికలు పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా జరిగేలా విధులు నిర్వర్తించాలని పోలింగ్ ప్రెసైడింగ్ అధికారులకు సూచించారు. జిల్లాలో నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణ కోసం చేబట్టిన సమగ్ర ఏర్పాట్లపై కలెక్టర్ ,కమిషనర్‌కు వివరాలు వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణ

- డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించిన కలెక్టర్ పి. ప్రావీణ్య

ప్రతిపక్షం,సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 10 : జిల్లాలో ఈనెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను, స్ట్రాంగ్ రూమ్ లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్యసందర్శించారు. మంగళవారం కలెక్టర్ కోహిర్, సదాశివపేట లలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరును క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో పోలింగ్ సిబ్బందికి తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు, ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేసారు. పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీయడంతో పాటు హాజరు నివేదికను పరిశీలించారు. ఎన్నికల పోలింగ్ సామాగ్రిని, బ్యాలెట్ బాక్స్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పోలింగ్ అధికారులు పరిశీలించు కోవాలని పోలింగ్ బృందాలకు కలెక్టర్ సూచించారు. అనంతరం ఆయా మున్సిపాలిటీలకు సంబంధించిన స్ట్రాంగ్ రూములను పరిశీలించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో దేవుజా, మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్ ఉన్నారు.

ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- ఎస్పీ రోహిత్ రాజు

ప్రతిపక్షం, కొత్తగూడెం, ఫిబ్రవరి 10: జిల్లాలోని కొత్తగూడెం కార్పొరేషన్, ఇల్లందు, అశ్వారావుపేట మున్సిపాలిటీలకు బుధవారం జరగనున్న పోలింగ్‌ను దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. ఈ నేపథ్యంలో పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్సుల పంపిణీ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ మంగళవారం పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 1200 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో నిరంతర నిఘా కోసం ప్రత్యేక బృందాలను నియమించామని తెలిపారు. అలాగే ఓట్ల లెక్కింపు కేంద్రంగా ఉన్న పాల్వంచ అనుబోస్ కళాశాల పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ ద్వారా నిరంతర తనిఖీలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగేందుకు ప్రజలు సహకరించాలని, ఎటువంటి భయాందోళనలు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ రోహిత్ రాజు సూచించారు.

పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, ఫిబ్రవరి 10: మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో రేపు బుధవారం జరగనున్న పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రం లోని ఏఎంసీ గోడౌన్ లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించి, ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను దగ్గరుండి పరిశీలించారు. కామారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలలో నిర్వహిస్తున్న 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాట్లు సజావుగా సాగుతున్నాయని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ నిరంతరాయంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల అధికారులు ఎన్నికల సామగ్రిని సకాలంలో, సురక్షితంగా సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది, భద్రతా సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతం చేయాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అవసరమైన మౌలిక వసతులు అన్ని పోలింగ్ కేంద్రాల్లో కల్పించినట్లు తెలిపారు. జిల్లాలో స్వేచ్ఛాయుత, న్యాయమైన ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం పూర్తిగా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పోలింగ్‌కు సంబంధించి సిబ్బందితో పాటు ఎన్నికల సామగ్రిని బస్సుల ద్వారా పోలింగ్ కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. విధులు నిర్వహించే అధికారులు పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే తక్షణమే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆత్మహత్య ఘటనపై కేసు నమోదు

- అన్ని కోణాల్లో దర్యాప్తు
- వెల్లడించిన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, ఫిబ్రవరి 10: మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 6వ వార్డు బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహదేవప్ప (44) ఆత్మహత్య చేసుకున్న ఘటనపై మృతుడి భార్య ఎరుకలి సత్యమ్మ ఫిర్యాదు మేరకు మక్తల్ పోలీస్ స్టేషన్లో 194 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసి ఈ ఘటనకు సంబంధించి నిష్పక్షపాతంగా సమగ్ర దర్యాప్తు జరిపి నిజానిజాలు వెల్లడిస్తామని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు ఎలాంటి ఊహాగానాలకు తావివ్వకుండా సహకరించాలని ప్రజలను జిల్లా ఎస్పీ కోరారు.

పరకాలలో పోలింగ్‌కు సర్వం సిద్ధం

- హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 10: పరకాలలో పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను పరిశీలించిన కలెక్టర్ హనుమకొండ పురపాలక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. జిల్లాలోని పరకాల పురపాలక సంఘంలోని 22 వార్డులకు బుధవారం పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. మంగళవారం పరకాలలోని గణపతి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి పోలింగ్ మెటీరియల్ పంపిణీ కోసం డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలింగ్ మెటీరియల్ తీసుకొని సరి చూసుకుంటున్న ఎన్నికల సిబ్బందితో కలెక్టర్ మాట్లాడారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి ఎంతమంది పిఓలు, ఏపీవోలు ఓపివోలు, మైక్రో అబ్జర్వర్లు హాజరు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. స్ట్రాంగ్ రూమును పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపునకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. కౌంటింగ్ సంబంధించిన ఏర్పాట్లను గురించి జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, పరకాల మున్సిపల్ కమిషనర్ అంజయ్య లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ప్రొజెక్టర్ స్క్రీన్ పెట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ పరకాల మున్సిపాలిటీలోని 22 వార్డు స్థానాలకు 44 పోలింగ్ కేంద్రాలలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. పోలింగ్ సామగ్రితో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పరకాల మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది బస్సులలో బయలుదేరి వెళ్లారు ఈ సందర్భంగా పరకాల తహసిల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో రవీందర్, టిపిఓ సుష్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహాదేవప్ప కుటుంబాన్ని పరామర్శించిన హుస్సేన్ నాయక్

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, ఫిబ్రవరి 10: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపుతున్న నారాయణపేట్ జిల్లా, మక్తల్ మున్సిపాలిటీ 6 వ వార్డు బీజేపీ అభ్యర్థి ఎరుకుల మహాదేవప్ప (ST) అనుమానాస్పద మృతి ఘటనపై దర్యాప్తు చేయడానికి మంగళవారం నాడు మక్తల్ లో జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోతు హుస్సేన్ నాయక్ పర్యటించరు. మక్తల్ కు చేరుకొని సంఘటన జరిగిన చోట కుటుంబసభ్యులతో మరియు స్థానికులు, ఎస్టీ సంఘాల నాయకులతో మాట్లాడుతూ అన్నగారిన బలహీన బహుజన వర్గాలకు ఈ విధమైన దాడి జరగడం బాధాకరం అని విచారణ వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు దుఃఖంలో ఉన్నందున జిల్లా ఎస్ పి డిపార్ట్మెంట్ ను ఆదేశిస్తున్న మూడు రోజులలో ఈ సంఘటనకు సంబంధించిన రికార్డులు, రిపోర్టు ఫోన్లు ఏ సాక్ష్యాలు ఉన్నా, ఢిల్లీకి తీసుకురావాలి లేని పక్షంలో కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు టీమ్ ను సంఘటన స్థలానికి పంపించి పూర్తిస్థాయిలో విచారిస్తామని అన్నారు. ఈ బీజేపీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులుకార్యక్రమంలో మృతుడి కుటుంబ సభ్యులు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య, బిజెపి నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు ఉన్నారు.

వాసవి క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రతిపక్షం, గుండాల, ఫిబ్రవరి 10: వాసవి క్లబ్ గ్రీన్ ఫీల్డ్స్ గుండాల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు.వాసవి క్లబ్ గ్రీన్ ఫీల్డ్ గుండాల మండల అధ్యక్షులుగా మానాల శ్రావణ్ కుమార్,ప్రధాన కార్యదర్శిగా మానాల ఉపేందర్,కోశాధికారిగా తవిడిశెట్టి రాంబాబును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ గ్రీన్ ఫీల్డ్స్ గుండాల మాజీ అధ్యక్షులు ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు మానాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.వాసవి క్లబ్ గ్రీన్ఫీల్డ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలతో ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానాల నారాయణమూర్తి, మానాల వీరన్న, మానాల ప్రభాకర్, తవిడిశెట్టి నాగరాజు, గౌరిశెట్టి సత్యనారాయణ, గౌరిశెట్టి ప్రభాకర్,గౌరీశెట్టి శరత్, తాటి పల్లి సత్యం, శ్రీరంగం శ్రీనివాస్, ఐత శ్రీశైలం, ఐత నాగమల్లయ్య, ఐత పూజిత్, తాటికొండ వీరన్న, పాలడుగు భరత్, గోలి కిరణ్ తదితరులు పాల్గొన్నారు

కోటిలింగేశ్వర స్వామి శివరాత్రి మహోత్సవాలకు

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానం

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట పిబ్రవరి 10: శ్రీ మా పార్తివ కోటిలింగేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నివాసంలో స్వామి వారి శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వానాన్ని అందించడం జరిగింది. ఫిబ్రవరి 12వ తేదీ నుండి 16వ తేదీ వరకు జరగనున్న శివరాత్రి మహోత్సవాల్లో పాల్గొనవలసిందిగా మంత్రివర్యులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చక సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఆలయ కమిటీ డైరెక్టర్లు పొన్నమల్ల యాదగిరి, దుండిగల్లు శ్రీనివాస్, శిఖ ఎల్లయ్య, సతీష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎరుకలి మహాదేవప్ప ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరగాలి

- ఒత్తిడి బెదిరింపులకు పాల్పడే నైజం మాది కాదు
- విచారణలో వాస్తవాలు బయటకు వస్తాయి
- మృతుడి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్న
- మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, ఫిబ్రవరి 10: మక్తల్ మున్సిపల్ ఎన్నికల్లో ఆరవ వార్డు నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీలో ఉండి ఆత్మహత్యకు పాల్పడ్డ ఎరుకలి మహాదేవప్ప సంఘటనపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇతరులపై ఒత్తిడి తేవడం బెదిరింపులకు పాల్పడే చర్యలకు కాంగ్రెస్ పాల్పడదని ఇది కాంగ్రెస్ పార్టీ నైజం అంతకన్నా కాదని అన్నారు. మంగళవారం మక్తల్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... ఎరుకలి మహాదేవప్ప, ఆత్మహత్య పై విచారణ వ్యక్తం చేస్తూ కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. రకరకాల ఆరోపణలు బయటకు వస్తున్నాయని వాస్తవం ఏంటి అన్నది తేలాల్సి ఉందని అన్నారు. విషయం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. ఎరుకలి మహదేవ్ ఆత్మహత్యకు పాల్పడడం పట్ల తీవ్ర విచార వ్యక్తం చేస్తూ ఈ సంఘటన తనను ఆందోళనకు గురి చేసిందన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడం గెలుపు ఓటమి సహజంగా జరుగుతూనే ఉంటాయన్నారు. బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కానీ ఎవరు కూడా ఏ ఒక్కరిపై ఒత్తిడి తేవడం బెదిరింపులకు పాల్పడడం లేదని అన్నారు. వాస్తవంగా బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన మహదేవ్ అంతకుముందు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తనేనని మంత్రి గుర్తు చేశారు. తనకు ఒకరిని బెదిరించాల్సిన అవసరం ఎంత మాత్రం లేదని చెప్పారు. ఈ క్షణం వరకు మృతుడు మహదేవును ప్రత్యక్షంగా చూడలేదన్నారు. చనిపోయాక వాట్సఅప్లో ఫోటోలు వచ్చినప్పుడు మాత్రమే చూశానని ఏ రోజు కూడా కనీసం ఫోన్ లో కూడా మాట్లాడలేదని ఒకవేళ ఆ విధంగా మాట్లాడి ఉంటే బెదిరింపులకు పాల్పడినట్లు తెలిస్తే చట్టరీత్యా ఏ చర్యల కన్నా సిద్ధమని అన్నారు. కానీ రాజకీయ లబ్ధి పొందేందుకు బిజెపి నాయకులు ఇలాంటి చీప్ పాలిటిక్స్ ప్లే చేయడం మానుకోవాలని అన్నారు. గతంలోనూ నర్వలో ఇలాంటి చర్యలకు పూనుకోవడం నిజాలు బయటికి రావడంతో వెనుకతగ్గాలని అన్నారు. మళ్ళీ ఇక్కడ అనవసరంగా నాపై నా పార్టీపై నిందలు మోపడం మానుకోవాలని అన్నారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరపాలని అధికారులను కోరుతున్నానని చెప్పారు. వాస్తవాలు బయటికి వస్తాయని అప్పుడు ఎవరు బాధ్యులో తేలుతుందన్నారు. ఒకవేళ నా ప్రమేయం ఏమాత్రం ఉంటే ఏ శిక్షకైనా సిద్ధమైనది రాజ్యాంగంగానికి తానేమి అతీతుడను కానని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఇకనుంచి అయినా బిజెపి నాయకులు ఇలాంటి ఆరోపణలకు దిగడం మానుకోవాలని కోరారు. ఈ విలేఖరుల సమావేశంలో బికేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గవినోళ్ళ బాలకృష్ణ రెడ్డి, జి.రవికుమార్ యాదవ్,కోళ్ళ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలి
- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి 10: మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. మెదక్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులపై జరిగిన దాడుల నేపథ్యంలో మంగళవారం మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలసి పద్మ దేవేందర్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా అడిషనల్ కలెక్టర్ నాగేష్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే అనుచరులు అర్ధరాత్రి హంగామా సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసారన్నారు. స్థానికేతరులైన మల్కాజ్గిరి నుంచి వచ్చిన గుండాలు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలపై దాడులకు దిగి అకారణంగా దాడులకు పాల్పడ్డారని చెప్పారు. దాడులు చేస్తూ మా పార్టీ కార్యకర్తల నాయకులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. మెదక్,రామయంపేట ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని కోరారు.వీరి రామాయంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగా. నరేందర్, లింసన్పల్లి మాజీ సర్పంచ్ మహిపాల్ రెడ్డి,నాయకులు స్వామి నాయక్,

“

బాబ్రీ మసీదు నిర్మాణం ఎప్పటికీ జరగదు. రామ్ లల్లా కోసం వస్తామని చెప్పాం. ఆలయం నిర్మిస్తామని చెప్పాం. ఆ మాట నిలబెట్టుకున్నాం. ఖయామత్ దినం రాదనేది వాస్తవం. అలాంటప్పుడు బాబ్రీ మసీదు నిర్మాణం ఎలా జరుగుతుంది? దాని గురించి కలలు కనొద్దు.
- బారాబంకి సభలో యోగి ఆదిత్యనాథ్

విశ్వ వీక్షణం

నరవణే అబద్ధం చెప్పరని నేను నమ్ముతున్నాను

- రాహుల్ గాంధీ



ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ బుక్ వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఆ బుక్‌లో ఉన్న కొన్ని అంశాలను ఇటీవల లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రస్తావించడంతో వారం రోజుల నుంచి లోక్‌సభలో గందరగోళం నెలకొంది. అయితే మంగళవారం పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. మాజీ ఆర్మీ చీఫ్ నరవణే చేసిన ఓ ట్వీట్‌ను చదివి వినిపించారు. తాను రాసిన పుస్తకం ఆన్‌లైన్‌లో దొరుకుతోందని, లింక్ ఓపెన్ చేస్తే విషయాలు తెలుస్తాయని తన ట్వీట్‌లో నరవణే పేర్కొన్నట్లు రాహుల్ వెల్లడించారు. ఆ బుక్‌ను పెంగ్విన్ రాండమ్ హౌజ్ ఇండియా ప్రచురించినట్లు తెలిసింది. కానీ తాము ఆ బుక్‌ను ఇంకా రిలీజ్ చేయలేదని పెంగ్విన్ సంస్థ తాజాగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. నరవణే అబద్ధం చెబుతున్నారా లేక పెంగ్విన్ సంస్థ అబద్ధం చెబుతుందా అని అడిగారు. ప్రింట్‌లో కానీ, డిజిటల్ ఫార్మాట్‌లో కానీ తాము ఆ పుస్తకాన్ని రిలీజ్ చేయలేదని పెంగ్విన్ సంస్థ చెబుతోంది. కానీ రాహుల్ మాత్రం అమెజాన్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే పెంగ్విన్ కన్నా మాజీ ఆర్మీ చీఫ్ వ్యాఖ్యలను నమ్ముతున్నట్లు రాహుల్ తెలిపారు.

నరవణె పుస్తకం లీక్ కేసు నమోదు

నరవణే రచించిన అముద్రిత పుస్తకం సోషల్ మీడియాలో పంపిణీ కావడంపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సోమవారం ఓ అధికారిక ప్రకటన వెలువడింది.

ఎప్‌స్టీన్ పార్టీలో ఎలాన్ మస్క్, జుకర్ బర్గ్!

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎప్‌స్టీన్ ఫైల్స్ సంచలనం సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. ఎప్‌స్టీన్ చేసిన అరాచకాలలో పలువురు ప్రముఖులు ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. అయితే, ఈ వివాదంలో ఇప్పుడు ఎక్స్, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్, మెటా సీఈవో మార్క్ జుకర్ బర్గ్ పాల్గొన్నారు. దీనికి సంబంధించి ఒక ఫొటో విడుదలైంది. ఇటీవల విడుదలైన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఈ ఫొటో లభ్యమైంది. ఈ ఫొటోలో లింకుడ్ ఇన్ కో ఫౌండర్ రీడ్ హాఫ్‌మన్, పే పాల్ కో ఫౌండర్ పీటర్ థెయిల్ కూడా హాజరయ్యారు. దీనికి సంబంధించిన మెయిల్‌లో ఈ ఈవెంట్‌ను 'వైల్డ్' అని పేర్కొన్నారు. ఈ ఫొటోలో వీళ్లంతా రాత్రి పూట డిన్నర్ చేస్తుండగా, ఒక టేబుల్ దగ్గర కూర్చొని ఉన్నారు. ఈ ఫొటో ఎప్‌స్టీన్ తీసినట్లుగా తెలుస్తోంది. ఈ ఫొటో 2015, ఆగష్టు 3న తీసినట్లు వెల్లడైంది. అయితే, ఈ అంశంపై ఇటీవల ఎలాన్ మస్క్ స్పందించిన తీరు వివాదాస్పదం అవుతోంది. ఆయన తాను ఎప్పుడూ ఎప్‌స్టీన్ పార్టీలకు హాజరు కాలేదని వెల్లడించాడు. అంతేకాదు.. పిల్లలపై అత్యాచారం, హత్య వంటి నేరాలకు పాల్పడ్డ నిందితులపై చర్యలు తీసుకోవాలని, ఆ ఫైల్స్ బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశాడు. కానీ, ఇప్పుడు మస్క్ పాల్గొన్న ఫొటో విడుదలైంది. ఈ అంశంపై మెటా సీఈవో మార్క్ జుకర్ బర్గ్ కూడా దీనిపై స్పందించారు. ఒక డిన్నర్ సందర్భంగా తాను ఎప్‌స్టీన్‌ను కలిశానని, ఆ పార్టీ తర్వాత తానెప్పుడూ మళ్లీ ఆయనను కలవలేదని చెప్పుకొచ్చినట్లు మెటా గతంలోనే వెల్లడించింది. మరోవైపు లింకుడ్ ఇన్ కో ఫౌండర్ రీడ్ హాఫ్‌మన్ ఇటీవల స్పందిస్తూ.. తాను ఒక సంస్థ నిధుల సేకరణ కోసం ఎప్‌స్టీన్‌ను కలిశానని, అంతకుమించి ఎప్‌స్టీన్ చేసిన నేరాలతో తనకు సంబంధం లేదని స్పష్టం చేశాడు. తాజాగా వెల్లడైన మెయిల్‌ను ఎప్‌స్టీన్ తనకుతానే సెండ్ చేసుకున్నట్లు తెలుస్తోంది.

ఫ్రాన్స్ అధ్యక్షుడి భారత పర్యటన ఖరారు

- ఫిబ్రవరి 17 నుంచి 19 వరకు పర్యటించనున్న మేక్రాన్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ భారత పర్యటన ఖరారైంది. ఫిబ్రవరి 17 నుంచి 19 మూడు రోజుల పాటు ఇండియాలో మేక్రాన్ పర్యటించనున్నట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ మంగళవారం ప్రకటించింది. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ విస్తృత శ్రేణి రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేయడంపై చర్చలు జరుపుతారని పేర్కొంది. ఇండోపసిఫిక్ ప్రాంతం సహా ప్రాంతీయ, ప్రపంచ అంశాలపై ఇరువురు నాయకులు చర్చించుకుంటారని స్పష్టం చేసింది. అలాగే ఢిల్లీలో జరిగే ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో మేక్రాన్ పాల్గొంటారని వెల్లడించింది. దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో మోదీ, మేక్రాన్ సంయుక్తంగా 'భారత్‌ఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్'ను ప్రారంభిస్తారని స్పష్టం చేసింది. ఈ మేరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది. ''ఇండోపసిఫిక్‌లో సహకారంతో పాటు పరస్పరం ఆసక్తి ఉన్న కీలకమైన ప్రాంతీయ, ప్రపంచ అంశాలపై మోదీ, మేక్రాన్ తమ అభిప్రాయాలను మార్పిడి చేసుకుంటారు. ఇది రెండు దేశాల మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక కలయికను ప్రతిబింబిస్తుంది. మేక్రాన్ భారత్ టూర్ ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యంలో పరస్పర విశ్వాసం, సంబంధాలను మరింతగా పెంచుకోవడానికి ఉపయోగపడుతుంది.''అని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. అలాగే మేక్రాన్ ఇండియా పర్యటన సమయంలోనే ఫ్రాన్స్‌తో ఇండియా అతిపెద్ద రక్షణ ఒప్పందం చేసుకోనుంది. 3 లక్షల 25 వేల కోట్ల వ్యయంతో 114 రఫేల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేసే డీల్‌ను చేసుకోనుంది. ఒకవేళ ఈ డీల్ ఖరారైతే దేశ చరిత్రలో అతి పెద్ద రక్షణ ఒప్పందంగా నిలువనుంది. అంతేకాకుండా ప్రపంచంలోనే ఫ్రాన్స్ వెలుపల రఫేల్ విమానాలను అత్యధికంగా నిర్వహించే దేశంగా భారత్ నిలుస్తుంది.

సంస్కృతి, ప్రగతికి చిహ్నం 'బస్తర్'

- అక్కడి గిరిజన వారసత్వాన్ని కొనియాడిన ప్రధాని మోడీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోటగా ఉన్న బస్తర్, ఇప్పుడు గొప్ప సంస్కృతి, ప్రగతి, ఆత్మవిశ్వాసానికి చిహ్నంగా మారిందని ప్రధాని మోదీ అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఫిబ్రవరి 7 నుంచి 9 వరకు జరిగిన 'బస్తర్ పండమ్'' పండుగపై ఆయన ప్రశంసలు కురిపించారు. ఈ పండుగ బస్తర్ ప్రాంతపు గొప్ప సంస్కృతి, సంప్రదాయాలు, గిరిజన వారసత్వాన్ని అద్భుతంగా ప్రదర్శించిందని కొనియాడారు. ఒకప్పటి మావోయిస్టు కేంద్రం నేడు శాంతికి నిలయంగా మారిందని పేర్కొన్నారు. భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంలో, స్థానిక సమాజాలను బలోపేతం చేయడంలో బస్తర్ పండమ్ వంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని సోషల్ మీడియా వేదికగా మోదీ కొనియాడారు. మరోవైపు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా బస్తర్ పండమ్‌ను ప్రశంసించారు. బస్తర్ ఇప్పుడు తన సంస్కృతి, వారసత్వంతో ముందుకు సాగుతూ, అభివృద్ధి చెందిన భారతదేశానికి రాయబారిగా ఎదుగుతోందని అన్నారు. జగదల్‌పుర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, గిరిజనులకు అవార్డును పంపిణీ చేసి, వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా, వామపక్ష తీవ్రవాదుల భయం, హింస నుంచి బస్తర్ ప్రజలు విముక్తి పొందుతున్నారని ఆయన అన్నారు.



అసోంలో 2.4 లక్షల ఓట్లు తొలగింపు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: అసోంలో 2.4 లక్షల ఓట్లను తొలగిస్తూ ఈసీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కొత్త ఓటర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. అసోంలో ఎన్నికల సంఘం స్పెషల్ రివిజన్ (ఎస్ఆర్) నిర్వహించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని 126 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎస్ఆర్ నిర్వహించి తాజా జాబితా విడుదల చేసింది. దీని ప్రకారం రాష్ట్రంలో మొత్తం 2,49,58,139 మంది ఓటర్లున్నారు. ఇంతకు ముందు ఉన్న 2,52,01,624 మంది ఓటర్లలోంచి 2,43,485 మందిని తొలగించింది. తాజా జాబితా ప్రకారం అసోంలో 1,24,82,213 మంది పురుష ఓటర్లు, 1,24,75,583 స్త్రీ ఓటర్లు, 343 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. మొదట ఇంటిగ్రేటెడ్ ఓటర్ల జాబితాను గత ఏడాది డిసెంబర్ 27న ప్రకటించారు. అంతకుముందు నవంబర్ 22 నుంచి డిసెంబర్ 20 వరకు ఇంటింటికీ తిరిగి ఓటర్ జాబితా సర్వే నిర్వహించారు. ఇందులో సరైన ధృవపత్రాలు లేని వారు, మరణించిన వారు, అలాగే రెండు లేదా అంతకంటే ఎక్కువ ఓట్లు కలిగి ఉన్నవారి పేర్లను జాబితా నుంచి తొలగించారు. డిసెంబర్ 27న డ్రాఫ్ట్ ప్రకటించిన తర్వాత మార్పులు, చేర్పులు, అభ్యంతరాలకు ఓటర్లకు జనవరి 22 వరకు సమయమిచ్చారు. ఈ లోపు వచ్చిన ఫిర్యాదులు అన్నీ పరిష్కరించి తాజాగా తుది జాబితా విడుదల చేశారు. వచ్చే మార్చిఏప్రిల్‌లో అసోంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

ప్రోస్టేట్ క్యాన్సర్.. నిర్లక్ష్యం వద్దు!

ప్రాణాంతక క్యాన్సర్ మహమ్మారి పేరు వింటేనే ఒళ్లు జలదరిస్తుంది. ఎంతోమందిని పొట్టన పెట్టుకుంటున్న ఈ వ్యాధికి ఎన్నో ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. అయితే క్యాన్సర్ వచ్చే ముందే శరీరం కొన్ని సిగ్నళ్లు అందిస్తుంది. దీని ఆధారంగా జాగ్రత్త పడాలి. పురుషులను ఈ మధ్య ప్రోస్టేట్ క్యాన్సర్ బాగా బాధిస్తోంది. సాధారణంగా 65 ఏళ్లు పైబడిన వాళ్లలో వచ్చే ఈ సమస్య ఇప్పుడు యుక్త వయసు వారిలోనూ వస్తోంది. ఇలాంటి డేంజర్ వ్యాధి ముందే వచ్చే సూచనలను అస్సలు నిర్లక్ష్యం చేయవద్దు..



అసలేంటీ ప్రొస్టేట్...

ప్రోస్టేట్ గ్రంధి వీర్యాన్ని తయారు చేసే, తీసుకెళ్లే సెమినల్ ద్రవాన్ని ఉత్పత్తి చేస్తుంది. 50 ఏళ్ల తర్వాత చాలామంది మగాళ్లలో దీనికి క్యాన్సర్ సోకి ప్రాణాంతకం అవుతోంది. ప్రోస్టేట్ గ్రంధి కణాలు కంట్రోల్ తప్పితే క్యాన్సర్ వస్తుంది. ఇందులోనూ చిన్న కణాల కార్సినోమాలు, న్యూరోఎండోక్రైన్ గడ్డ, పరివర్తన చెందిన కణాల కార్సినోమాలు, సార్కోమాస్ అనే రకరకాల క్యాన్సర్లు ఉన్నాయి.

లక్షణాలు ఇవే..

ప్రోస్టేట్ క్యాన్సర్ వస్తే శరీరంలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. ప్రోస్టేట్ గ్లాండ్ సాధారణంగా మూత్రనాళం దగ్గరే ఉంటుంది. మూత్ర విసర్జనలో ఇబ్బంది లేదా మూత్రం పోసేటప్పుడు మంటగా అనిపించడం, రాత్రిపూట ఎక్కువసార్లు మూత్రం పోయడం, మూత్రంలో లేదా వీర్యంలో రక్తం కనిపించడం.. ఇవన్నీ ఈ క్యాన్సర్ లక్షణాలే.. అంగస్తంభన సమస్యలు రావడం, స్ఖలనం సమయంలో నొప్పి అనిపించడం ఉంటాయి. ముఖ్యంగా మీ మూత్రం అలవాట్లను గమనించండి. ముందుకంటే ఎక్కువసార్లు బాత్రూమ్ కి వెళ్తుంటే అనుమానించాల్సిందే. ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి.

క్యాన్సర్ ఎక్కువైతే

చాలాసార్లు రోగం లేట్ గా కనిపెడితే, సరైన ట్రీట్మెంట్ లేకపోతే క్యాన్సర్ ప్రోస్టేట్ గ్లాండ్ బయట ఎముకలు, శోషరస గ్రంథులకు కూడా పాకవచ్చు. కాళ్లు లేదా నడుములో వాపు, నడుము, కాలు లేదా పాదాల్లో తిమ్మిర్లు, నొప్పి, ఎముకల నొప్పి, విరగడం కూడా జరుగుతాయి. సమయం మించితే కోలుకోవడం కష్టం. ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చే సగటు వయస్సు 68 అని ఉండేది. ఇప్పుడు యంగ్ వాళ్లలో కూడా వస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 15 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న పురుషుల్లో కూడా ఈ క్యాన్సర్ కనిపిస్తోంది. రెగ్యులర్ గా టెస్టులు చేయించుకుంటే, లక్షణాలు తెలుసుకుని ట్రీట్మెంట్ తీసుకుంటే బతికే ఛాన్స్ ఎక్కువ. పెద్దవాళ్లలో ప్రోస్టేట్ క్యాన్సర్ కన్నా యంగ్ ఏజ్ వాళ్లలో ఈ రోగాన్ని తొందరగా గుర్తించవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా ప్రోస్టేట్ క్యాన్సర్ రెండో అత్యంత కామన్ క్యాన్సర్. మగాళ్లు చనిపోవడానికి ఇది ఆరో ప్రధాన కారణం. నేషనల్ పాపులేషన్ బేస్డ్ క్యాన్సర్ రికార్డు ప్రకారం ఢిల్లీ, కోల్‌కతా, పూణే, తిరువనంతపురంలో మగాళ్లలో ప్రోస్టేట్ క్యాన్సర్ రెండో ప్రధానమైనది. బెంగళూరు, ముంబైలో క్యాన్సర్ మూడో ప్రధానమైనది. ముసలితనంలో క్యాన్సర్ వచ్చే ఛాన్స్ ఎక్కువ. ఫ్యామిలీలో ఎవరికైనా క్యాన్సర్ ఉంటే జాగ్రత్తగా ఉండాలి. లావుగా ఉన్నవాళ్లు అధిక జాగ్రత్తలు తీసుకోవాలి. అనారోగ్యకరమైన లైఫ్ స్టైల్ కూడా క్యాన్సర్ కి మరో కారణం. ఇంట్లోనే పీఎస్ఏ బ్లడ్ టెస్ట్ చేసుకోవడం మంచిది. ఏదో తేడాగా ఉంటే డాక్టర్ ని కలిసి గుదనాళ పరీక్ష చేయించుకోండి. అక్కడ వాళ్లు ప్రోస్టేట్ ని టెస్ట్ చేస్తారు. పండ్లు, కూరగాయలతో కూడిన ఆరోగ్యకరమైన ఆహారం, రెగ్యులర్ ఎక్సర్సైజ్, శరీరానికి తగిన బరువును మెయింటైన్ చేయడం ప్రోస్టేట్ క్యాన్సర్ రిస్క్ ని తగ్గిస్తుంది. తక్కువ కొవ్వు ఉన్న ఆహారం తీసుకోవడం, డైలీ డైరీని తగ్గించడం ఆరోగ్యానికి మంచిది. శారీరకంగా యాక్టివ్ గా ఉండటం కూడా ముఖ్యం. రెగ్యులర్ స్క్రీనింగ్ చేయించుకుంటే ఇంకా మంచిది.

చర్మానికి అందాన్ని తెచ్చే పండ్లు

ఎండాకాలంలో స్కిన్ చాలా డ్యామేజ్ అవుతుంది. ముఖ్యంగా ఎండకు బయటకు వెళ్లేవారి చర్మం మరింత దెబ్బతింటుంది.ఇలా దెబ్బతినకుండా ఉండేందుకు చాలా మంది చాలా రకాల స్కిన్ కేర్ ప్రొడక్ట్స్ ని వాడుతూ ఉంటారు. అయితే,వాటిలో ఉండే కెమికల్స్ మన చర్మానికి మేలు చేయడం పక్కన పెడితే.. నష్టం చేసే అవకాశం కూడా ఎక్కువగా ఉంటుంది.మరి, అలా కాకుండా.. చర్మాన్ని అందంగా మార్చుకోవాలంటే ఏం చేయాలా అని ఆలోచిస్తున్నారా? దాని కోసం మీరు పెద్దగా టెన్షన్ పడాల్సిన అవసరం లేదు. కేవలం కొన్ని రకాల పండ్లతో మీ అందాన్ని పెంచుకోవచ్చు.

1.మామిడి పండు..

మామిడి పండును అన్ని పండ్లలో కెల్లా రారాజుగా పిలుస్తారు. ఇది ఆరోగ్యానికి మాత్రమే కాదు, చర్మంపై కూడా అద్భుతాలు చేస్తుంది. ఈ పండులో విటమిన్ ఏ, సి లతో నిండి ఉంటుంది. ఇది చర్మాన్ని హైడ్రేట్ గా చేయడానికి, స్కిన్ డ్యామేజ్ కంట్రోల్ చేయడానికి కూడా సహాయం చేస్తుంది. అంతేకాదు.. స్కిన్ ని మృదువుగా మార్చడానికి హెల్ప్ చేస్తుంది.చర్మాన్ని హైడ్రేటెడ్ గా కూడా చేస్తుంది.

2.పుచ్చకాయ..

పుచ్చకాయను వేసవి పండు అని చెప్పొచ్చు. ఈ సీజన్‌లో ఆరోగ్యాన్ని కాపాడటంలో ఈ పండు బాగా సహాయపడుతుంది. ఈ పండులో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. చర్మాన్ని హైడ్రేటెడ్ గా ఉంచడానికి సహాయపడుతుంది. ఈ పుచ్చకాయలో విటమిన్ ఏ, సి పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. దీంతో యవ్వనంగా కనపడతాం.

3. బొప్పాయి

బొప్పాయి పండులో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది చనిపోయిన డెడ్ స్కిన్ సెల్స్ ని తొలగిస్తుంది. ముఖంపై ఏవైనా నల్లమచ్చలు ఉన్నా, వాటిని తొలగించడంలో సహాయం చేస్తుంది. స్కిన్ కలర్ ని మెరుగుపరుస్తుంది.

4. నారింజ

నారింజ పండులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఈ విటమిన్ సి మన స్కిన్ ని మెరిచేలా చేయడానికి సహాయపడుతుంది. నల్లటి మచ్చలను తొలగించడానికి, స్కిన్ ని టైట్ గా మార్చడానికి సహాయపడుతుంది. దీని వల్ల య వ్వనంగా మారేలా చేస్తుంది.

5.పైనాపిల్..

పైనాపిల్ లో బ్రోమెలైన్ పుష్కలంగా ఉంటుంది. ఇది చనిపోయిన డెడ్ స్కిన్ సెల్స్ ని తొలగించడానికి సహాయపడుతుంది. స్కిన్ పై నల్ల మచ్చలు తొలగించడానికీ సహాయపడుతుంది. ఇందులో కూడా విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది కూడా చర్మాన్ని యవ్వనంగా మార్చుతుంది.మీరు కోల్పోయిన స్కిన్ గ్లోని మళ్లీ తీసుకురావడంలో సహాయపడుతుంది.

ఈ పండ్లను స్కిన్ కేర్ రొటీన్ లో ఎలా వాడాలి..?

DIY ఫేస్ మాస్క్‌లు: కేవలం అరగంటలో మన ముఖంపై మెరుపు తీసుకురావాలి అంటే ఈ పండ్లతో ఫేస్ మాస్క్ వేస్తే చాలు. తక్షణ మెరుపు కోసం పుచ్చకాయ, బొప్పాయి లేదా మామిడి వంటి పండ్లను తేనె లేదా పెరుగుతో కలపండి. ఈ మిశ్రమాన్ని మీ ముఖానికి అప్లై చేసి 1015 నిమిషాలు అలాగే ఉంచి, తర్వాత శుభ్రం చేసుకోండి.

పండ్లతో కలిపిన ఐస్ క్యూబ్స్: పండ్ల రసం లేదా గుజ్జును ఫ్రీజ్ చేసి, ఆ క్యూబ్స్‌ను ఉపయోగించి మీ ముఖంపై సున్నితంగా రుద్దండి. ముఖం గ్లోయిగా మారుతుంది.

హైడ్రేటింగ్ : రోజంతా రిఫ్రెషింగ్ గా మీ ఫేస్ ఉంచాలి అనుకుంటే, దాని కోసం పండ్ల సారాలను (పుచ్చకాయ, నారింజ లేదా పైనాపిల్ వంటివి) రోజ్ వాటర్‌తో కలపండి. అవి ముఖానికి రాసినా చాలు.

స్క్రబ్‌లు, ప్యాక్‌లు: సున్నితమైన ఎక్స్‌ఫోలియేషన్ కోసం పండ్ల తొక్కలు లేదా గుజ్జులను ఉపయోగించండి. ఉదాహరణకు, నారింజ తొక్కల పొడి లేదా బొప్పాయి గుజ్జును కొద్దిగా తేనెతో కలిపి మీ చర్మాన్ని మృదువుగా , ప్రకాశవంతంగా ఉంచే సహజ స్క్రబ్‌ను తయారు చేసుకోవచ్చు. దీనిని ముఖానికి సున్నితంగా రుద్దడం వల్ల కూడా మీ ముఖాన్ని అందంగా మార్చుకోవచ్చు.

ఓపెనర్లే బాదేశారు

- యూఏఈపై న్యూజీలాండ్ ఘన విజయం

టీ20 ప్రపంచకప్ 2026లో న్యూజిలాండ్ జట్టు మరోసారి తన ఆటతీరుతో అదరగొట్టింది. యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో కివీస్ ఓపెనర్లు టిమ్ సిఫర్ట్, ఫిన్ అలెన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగి జట్టుకు 10 వికెట్ల భారీ విజయాన్ని అందించారు. చెన్నైలోని చెపాక్ మైదానం వేదికగా మంగళవారం జరిగిన ఈ పోరులో న్యూజిలాండ్ ఏకపక్షంగా ఆధిపత్యం చాటింది. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. ఓపెనర్లు మహమ్మద్ వసీమ్, అలీషాన్ షరాఫు జట్టుకు మంచి ఆరంభం ఇచ్చారు. కివీస్ బౌలర్లకు చుక్కలు చూపించిన ఆ జోడీ పవర్‌ప్లేలోనే బౌండరీలు రాబట్టింది. ముఖ్యంగా వసీమ్ దూకుడుగా ఆడుతూ బౌలర్లపై ఒత్తిడి తెచ్చాడు. వసీమ్ 45 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో అజేయంగా 66 పరుగులు చేశాడు. షరాఫు 47 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 55 పరుగులు సాధించి అర్ధ శతకం పూర్తి చేశాడు. వీరిద్దరి భాగస్వామ్యంతో యూఏఈ గౌరవప్రదమైన స్కోరు సాధించింది. మధ్యలో కొన్ని వికెట్లు కోల్పోయినా చివరి ఓవర్లలో వేగంగా పరుగులు జోడించి 173 పరుగుల లక్ష్యాన్ని నిలబెట్టగలిగింది. 174 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన న్యూజిలాండ్ ఓపెనర్లు మాత్రం ప్రత్యర్థి బౌలర్లకు ఏమాత్రం అవకాశమివ్వలేదు. టిమ్ సిఫర్ట్, ఫిన్ అలెన్ ఇద్దరూ ఆరంభం నుంచే దాడి ధోరణి ప్రదర్శించారు. ఫోర్లు, సిక్సర్లతో బౌండరీల వర్షం కురిపిస్తూ స్కోరు బోర్డును వేగంగా నడిపించారు. ఈ విజయంతో న్యూజిలాండ్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ గెలిచి పాయింట్ల టేబుల్‌లో తన స్థానం బలోపేతం చేసుకుంది. గత ఎడిషన్‌లో నిరాశపరిచిన కివీస్ ఈసారి మాత్రం గట్టి హెచ్చరికలు పంపుతున్నట్టు కనిపిస్తోంది.

పాకిస్తాన్ యూటర్న్.. ఇండియాతో మ్యాచ్‌కు ఓకే!

టీ20 వరల్డ్ కప్‌లో భారత్‌తో మ్యాచ్ ఆడబోమంటూ ప్రకటించిన పాకిస్థాన్ ప్రభుత్వం ఎట్టకేలకు వెనక్కి తగ్గింది. టీమ్‌ఇండియాతో మ్యాచ్ బాయ్‌కాట్ చేయాలనుకున్న తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. ఈ మేరకు పాకిస్థాన్ నుంచి సోమవారం అర్ధరాత్రి ప్రకటన వచ్చింది. పీసీబీతో ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ చర్చల అనంతరం ఈ ప్రకటన వచ్చింది. ఈ చర్చలతో సంతృప్తి చెందడమే కాకుండా మిత్ర దేశాలు భారత్‌తో మ్యాచ్ ఆడాలని విజ్ఞప్తి చేయడంతో పాక్ ప్రభుత్వం పీసీబీకి అనుమతి ఇచ్చింది. 'భారత్‌తో మ్యాచ్ విషయంలో చర్చలపై సంతృప్తిగా ఉన్నాం. అలాగే మిత్ర దేశాల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని టీమ్‌ఇండియాతో మ్యాచ్ బాయ్‌కాట్ నిర్ణయాన్ని విత్ డ్రా చేసుకుంటున్నాం. టీ20 ప్రపంచ కప్‌లో షెడ్యూల్ ప్రకారం భారత్‌తో మ్యాచ్ ఆడాల్సిందిగా మా (పాకిస్థాన్) క్రికెట్ బోర్డును అదేశిస్తున్నాం. దీంతో ఫిబ్రవరి 15న భారత్‌తో మ్యాచ్ కోసం మా జట్టు మైదానంలోకి దిగుతుంది' అని పాక్ ప్రభుత్వం పత్రికా ప్రకటనలో పేర్కొంది.

శ్రీలంక టీమ్ నుంచి వైదొలగిన ఆల్ రౌండర్

తొలి విజయంతో జోరుమీదున్న శ్రీలంక జట్టు వనిందు హసరంగ సేవల్ని కోల్పోనుంది. గాయం కారణంగా ఈ సీనియర్ ఆల్‌రౌండర్ మెగా టోర్నీ నుంచి వైదొలగడమే అందుకు కారణం. తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై మూడు వికెట్లతో మెరిసిన హసరంగ అనూహ్యంగా గాయంతో ఇబ్బంది పడ్డాడు. వైద్య పరీక్షల అనంతరం అతడికి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. దాంతో.. ఈ మ్యాచ్ విన్నర్ అందుబాటులో ఉండడు. ప్రపంచకప్ వంటి మెగా టోర్నీల్లో ఏ జట్టైనా తమ ప్రధాన అస్త్రాలను నమ్ముకుంటుంది. కానీ, శ్రీలంకకు మాత్రం ఈసారి ఆ అవకాశం కోల్పోయింది. ఇప్పటికే పేసర్ ఇషాన్ మలింగ గాయంతో దూరమవ్వగా.. ఇప్పుడు ఆల్‌రౌండర్ హసరంగ సైతం వరల్డ్‌కప్ నుంచి నిష్క్రమించాడు. ఇటీవల కాలంలో గాయాలతో సతమతమవుతూ జట్టుకు దూరమైన వనిందు హసరంగ ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో ఎడమ కాలి కండరాల నొప్పితో ఇబ్బందిపడ్డాడు. ఫిజియో వచ్చి పరీక్షించాక ఓవర్ పూర్తి చేసిన అతడు.. వికెట్ తీసి డగౌట్‌కు వెళ్లాడు. కాసేపటికి తిరిగొచ్చిన హసరంగ మరో వికెట్ తీసి లంక విజయంలో కీలకమయ్యాడు. కానీ, మ్యాచ్ అనంతరం ఎంఆర్ఐ స్కానింగ్‌లో అతడికి ఎడమ కాలి కండరంలో చీలక వచ్చినట్టు గుర్తించారు. దాంతో.. వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అలా ఈ స్టార్ ఆల్‌రౌండర్ మెగా టోర్నీకి దూరం కావాల్సి వచ్చింది. అతడి స్థానంలో దుషాన్ హేమంత స్క్వాడ్‌లోకి రానున్నాడు.

సచిన్ కుమారుడి వివాహం

రాష్ట్రపతి, ప్రధానికి ఆహ్వానం

ఇండియా క్రికెట్ దిగ్గజం, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ తెందుల్కర్ ఇంట్లో పెళ్లి సందడి మొదలైంది. ఆయన కుమారుడు, యువ క్రికెటర్ అర్జున్ తెందుల్కర్ త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నాడు. చిన్ననాటి స్నేహితురాలు సానియా చందోక్‌తో అర్జున్ పెళ్లి జరగనుండటం కుటుంబ సభ్యుల్లో ఆనందాన్ని నింపుతోంది. మార్చి 5న ముంబయిలో ఆ వివాహ వేడుక ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే పెళ్లి పనులు జోరందుకోగా, సచిన్ కుటుంబం ప్రత్యేక అతిథులకు స్వయంగా ఆహ్వానాలు అందజేస్తోంది. ఈ క్రమంలో తాజాగా సచిన్ తన కుటుంబ సభ్యులతో కలిసి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, దేశ ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. మంగళవారం న్యూదిల్లీలో ప్రధాని నివాసానికి వెళ్లిన సచిన్, అర్జున్ సానియా వివాహ ఆహ్వాన పత్రికను మోదీకి అందజేశారు. ఈ సందర్భంగా చందోక్ కుటుంబ సభ్యులు కూడా సచిన్ కుటుంబంతో పాటు ఉన్నారు. సచిన్ కుటుంబాన్ని ప్రధాని మోదీ ఆత్మీయంగా పలకరించారు. కాబోయే వధూవరులను ఆశీర్వదిస్తూ, వారి భవిష్యత్తు సుఖసంతోషాలతో నిండాలని కోరుకున్నారు. అనంతరం ఇరు కుటుంబాలతో కలిసి ఫొటోలు దిగారు. అదే సమయంలో మోదీతోపాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షాను సచిన్ ఆహ్వానించారు.

వరల్డ్ కప్ విజేతకు సచిన్ గిఫ్ట్

- అండర్ 10 టీమ్ ను అభినందించిన మాస్టర్

అండర్ 19 వరల్డ్‌కప్ హీరోలపై ప్రశంసల జల్లు కురుస్తోంది. జగజ్జేతలుగా స్వదేశం తిరిగొచ్చిన భారత బృందాన్ని దిగ్గజ ఆటగాళ్లు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ తాజాగా కెప్టెన్ ఆయుశ్ మాత్రేకు అపురూపమైన కానుక అందించాడు.



భారత్‌ను అజేయంగా నడిపించి విశ్వ విజేతగా నిలిపినందుకు అతడికి తన టెస్టు జెర్సీని బహూకరించాడు. లెజెండరీ ఆటగాడి నుంచి విలువైన బహుమతి అందుకున్న మాత్రే సంతోషం వ్యక్తం చేస్తూ పోస్ట్ పెట్టాడు. ప్రతిభావంతులను ప్రోత్సహించడంలో ముందుండే సచిన్ టెండూల్కర్ ఈసారి అండర్ 19 వరల్డ్‌కప్ కెప్టెన్ ఆయుశ్ మాత్రేను ఆకాశానికెత్తేశాడు. భారత జట్టుకు ఆరో కప్‌ను సాధించిన అతడిని ప్రశంసించిన సచిన్.. అతడికి మర్చిపోలేని బహూకరించాడు. మంగళవారం ముంబైలోని తన నివాసంలో మాత్రేను అభినందించిన క్రికెట్ దిగ్గజం.. డియర్ ఆయుశ్.. నీ కెరీర్ విజయవంతంగా సాగాలని కోరుకుంటున్నా అని రాసున్న టెస్టు జెర్సీని కానుకగా ఇచ్చాడు. ఇలానే కష్టపడుతూ ఉండు. జనాల కామెంట్లను పట్టించుకోకు. ఎన్ని అవరోధాలు ఎదురైనా ప్రాక్టీస్ మానేయకు. ఆట మీద శ్రద్ధతో ఉండాలి అని యువ క్రికెటర్‌కు సచిన్ విలువైన సూచనలను చేశాడు.



4కె క్వాలిటీలో 'అతడు' ఫిబ్రవరి 28న రీ రిలీజ్

సూపర్‌స్టార్ మహేష్‌బాబు ఐకానిక్ క్లాసిక్ 'అతడు' మరోసారి గ్రాండ్‌గా వెండి తెరపైకి రాబోతోంది. ప్రేక్షకుల మనసులో చెరగని ముద్రవేసిన ఈ టైమ్‌లెస్ క్లాసిక్ ఫిబ్రవరి 28న 4K ఫార్మాట్ లో థియేటర్లలో రీ-రిలీజ్ కానుంది. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటించారు. వెటరన్ నటుడు-నిర్మాత మురళీ మోహన్ ప్రతిష్టాత్మకంగా జయభేరి ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ సినిమాను నిర్మించారు. మహేష్ బాబు స్టైలిష్ పెర్ఫార్మెన్స్, తివిక్రమ్ మార్క్ డైలాగ్స్, క్లాస్ మేకింగ్, అద్భుతమైన పాటలు, మర్చిపోలేని యాక్షన్ తో అతడు కల్ట్ క్లాసిక్‌గా నిలిచింది. ఇప్పుడు సూపర్ 4K లో, డాల్బీ ఆడియోతో మరోసారి థియేటర్లలో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. థియేటర్ లిస్ట్స్, బుకింగ్ డీటెయిల్స్ త్వరలోనే వెల్లడించనున్నారు.

అజరామరం ఘంటసాల గానం

నేడు ఘంటసాల వర్ధంతి

భారతావనిలో ఎందరో గాయకులు ఉద్భవించారు. ఎందరో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. కాని సంగీత ప్రియుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొందిన ఘనత ఘంటసాల మాస్టారుకే దక్కుతుంది. ప్రముఖ గాయకులుగా, తెలుగు సినీ సంగీత దర్శకులుగా, జైలు కెళ్ళిన స్వాతంత్ర్య సమర యోధులుగా ఎనలేని కీర్తినార్జించిన గాన గంధర్వుడు తెలుగువాడు కావడం గర్వకారణం. 1922 డిసెంబర్ 4న గుడివాడ సమీప చౌటపల్లి గ్రామంలో ఘంటసాల సూర్యనారాయణ, రత్నమ్మలకు జన్మించిన వేంకటేశ్వర రావు నామాంకితుడైన ఘంటసాల, బాల్యం నుండే సంగీతం పట్ల మక్కువ కలిగి ఉన్నారు. కచేరీలలో తండ్రి మృదంగం సహకారం అందించడానికి వెళుతూ, కుమారుడిని భుజంపై ఎత్తుకుని పాటలు పాడుకుంటూ తీసుకెళ్ళేవారు. కచేరీలలో నాట్యం చేస్తూ, బాల భరతుడు అనిపించు కున్నారు, తాము గొప్ప సంగీత విద్వాంసుడు కావాలనే తమ 11వ ఏట మరణించిన తండ్రి ఆకాంక్షను సాకారం చేయ దృఢ సంకల్పులై, ఒకసారి ఒక సంగీత కచేరీలో పోటీపడి ఓటమి చెందగా, పట్టుదల మరింత పెరిగి, గురుకులాలలో చేరి, కట్టుబాట్లకు తట్టుకోలేక తిరిగి వచ్చేసారు. కొందరు విద్వాంసుల ఇళ్ళల్లో బట్టలుతికి, వంటచేసి, సంగీతా భ్యాసం చేసి, తర్వాత తమ దగ్గరున్న నలభై రూపాయల విలువైన బంగారు ఉంగరాన్ని కేవలం ఎనిమిది రూపాయలకే విక్ర యించి, ఆంధ్రరాష్ట్రంలోని ఏకైక సంగీత కళాశాల ఉన్న విజయ నగరానికి చేరుకున్నారు. రోజుకో ఇంటిలో భోజనం చేస్తూ, జోలెకట్టి అడుక్కుంటూ, ఎల్లమ్మ గుడిలో తల దాచుకున్న ఘంటసాలను పట్రాయని సీతారామశాస్త్రి యాదృచ్ఛికంగా చూడడం, తన ఇంట ఉచితంగా శిక్షణ నివ్వడానికి శాస్త్రి అంగీకరించడం ఘంటసాల జీవితాన్ని మలుపు తిప్పిన సంఘటన. పేదవాడైన శాస్త్రి, ఘంటసాలకు మధూకర (ఉంఛ వృత్తి) నేర్పించారు. తర్వాత కళాశాలలో చేరి, 4ఏళ్ళ కోర్సును రెండేళ్లకే పూర్తి చేశారు. కొన్నాళ్ళు విజయ నగరంలో కచేరీలు చేసి స్వగ్రామం చౌటపల్లికి చేరుకుని, ఉత్సవాలలో, వివాహ తదితర సందర్భాలలో గాన కచేరీలు చేసి, పాతాలు నేర్చారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, రెండేళ్ళు అలీపూర్ జైల్లో కఠిన కారాగార శిక్ష అనుభవించారు. 1944 మార్చి 4న తమ మేనకోడలు సావిత్రిని పరిణయమాడారు. తమ వివాహ సందర్భంలో స్వయంగా సంగీత కచేరీ చేశారు. అత్తవారి ఊరిలో సముద్రాల రాఘవాచారిని కలవగా, ఆయన సూచనపై, రెండు మాసాలు కచేరీలు చేసి, సమకూర్చుకున్న డబ్బుతో,

అప్పు చేసి మద్రాసుకు చేరుకున్నారు. రాఘవాచారి ద్వారా నాటి సినీ ప్రముఖులైన చిత్తూరు నాగయ్య, బి.ఎన్.రెడ్డిల సమక్షంలో పాటలు పాడి, ప్రశంసాపాత్రు లైనారు. పానగల్ పార్కులో నిద్రిస్తూ సముద్రాల చొరవతో మద్రాసు రేడియో కేంద్రంలో లలిత సంగీత గాయకునిగా అవకాశం పొందారు. కొన్ని గీతాలు రచించి, స్వరకల్పన చేసి, స్టేషన్ ద్వారా పాడారు. తర్వాత కాలంలో భువన విజయం పేరుతో వాటిని గ్రంథస్థం గావించారు. సినిమాలలో చిన్నచిన్న వేషాలు వేసారు. "స్వర్గసీమ" చిత్రంలో తొలిసారి నాగయ్య, బి.ఎన్.రెడ్డిలు అవకాశం ఇవ్వగా, భానుమతితో పాడిన పాటకు 118 రూపాయల పారితోషికం పొందారు. భానుమతి రామకృష్ణలు తీసిన రత్నమాల చిత్ర సహాయ సంగీత దర్శకత్వ అవకాశం పొంది, తర్వాత బాలరాజు, మనదేశం లకు సంగీత దర్శకులైనారు. 1951లో విడుదలైన "పాతాళ భైరవి" ఘన విజయం ఘంటసాలకు ఎనలేని పేరు తెచ్చి పెట్టింది. మల్లీశ్వరి తర్వాత 1953లో దేవదాసు, 55లో అనార్కలి, 57లో మాయాబజార్ లాంటి హిట్ సినిమాలు ఘంటసాలను సాటిలేని మేటి గాయకునిగా నిలబెట్టాయి. 1970 వరకూ హీరో లకు, విలన్లకు, కమేడియర్లకు పాడిన ప్రతి పాటా మాస్టరుదే కావడంతో ఆయన సినీ సంగీత సామ్రాజ్యానికి మకుటం లేని మహా రాజయ్యారు. 1970లో పద్మశ్రీ పురస్కారం గ్రహించారు. 71లో ఐరోపా, అమెరికాలలో ప్రదర్శనలు నిర్వహించారు. ఆరోగ్యం క్రమేపీ క్షీణించి చివరకు 1974 ఫిబ్రవరి 11న యావదాంధ్ర సంగీత ప్రియులను శోకసంద్రంలో ముంచి, స్వర్గస్థులైనారు. కరుణశ్రీ, జాషువా, మల్లాది రామకృష్ణశాస్త్రి వంటి వారి ప్రశంసలకు పాత్రులై, వారి రచనలను వీధి పాటలుగా, నూతన ఒరవడితో శైలితో పద్యాలుగా, సామాన్య జన బాహుళ్యానికి అందుబాటులోకి తెచ్చిన ఘనత మాస్టారుదే. సాంప్రదాయ సంగీతానికి భంగం వాటిల్ల నీయకుండా, సామాన్య సంగీత ప్రియులకు సైతం హృదయ రంజకంగా పాడిన "శేషశైలావాసా", "ఏడు కొండ స్వామి", రహస్యం, లవకుశ, నర్తన శాల, ఒకటేమిటి పాడిన పాటలెన్నో పండిత పామర ప్రశంసాపాత్రాలైనాయి. జన్మతః లభ్యమైన సుమధుర గంభీర గాత్రంతో గానం చేసిన "భగవద్గీత అజరామర సుస్వరాన్ని కలిగిన ఘంటసాలను అనునిత్యం స్మరణీయునిగా చేస్తూనే ఉంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

'ఫంకీ' అందరూ మెచ్చేలా ఉంటుంది

- దర్శకుడు కె.వి. అనుదీప్

'జాతిరత్నాలు'తో హాస్య చిత్రాలలో కొత్త పంథాను సృష్టించిన దర్శకుడు కె.వి. అనుదీప్, ఇప్పుడు 'ఫంకీ'తో మరోసారి థియేటర్లలో నవ్వుల వర్షం కురిపించడానికి వస్తున్నారు. మాస్ కా దాస్ విశ్వక్ సేన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాలో కయాదు లోహర్ కథానాయిక. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం కానుకగా ఒకరోజు ముందుగా ఫిబ్రవరి 13న విడుదలవుతున్న 'ఫంకీ' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు విశేషంగా ఆకట్టుకొని అంచనాలను రెట్టింపు చేశాయి. ప్రేక్షకులకు మరిచిపోలేని వినోదాల విందుని అందించడానికి 'ఫంకీ' చిత్రం ఫిబ్రవరి 13న థియేటర్లలో అడుగుపెడుతున్న నేపథ్యంలో తాజాగా దర్శకుడు కె.వి. అనుదీప్ మీడియాతో ముచ్చటించి సినిమాకి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "'ఫంకీ' టైటిల్ వినడానికి క్యాచీగా ఉంటుంది. అలాగే ఈ తరం అభిరుచులకు తగ్గట్టుగా ఉంటుందని ఈ టైటిల్ ను ఎంచుకోవడం జరిగింది. హీరో పాత్రకు కూడా ఈ టైటిల్ సరిగ్గా సరిపోతుంది. విశ్వక్ సేన్ ఇందులో ఒక సినిమా దర్శకుడి పాత్రలో కనిపిస్తారు. ఈ పాత్రను రాసుకున్నప్పుడే విశ్వక్ అయితే బాగుంటారు అనిపించింది. 'ఈ నగరానికి ఏమైంది' సినిమాలో ఆయన కామెడీ టైమింగ్ బాగుంటుంది. 'జాతిరత్నాలు'తో పోలిస్తే 'ఫంకీ' చిత్రం పూర్తి కొత్తగా ఉంటుంది. ఇది అవుట్ అండ్ అవుట్ రొమాంటిక్ కామెడీ మరియు ఫ్యామిలీ ఎంటర్టైనర్. ఇందులో దర్శకుల జీవితాల్లో జరిగే కొన్ని సంఘటనలను సాధారణ ప్రేక్షకులకు కూడా అర్థమయ్యేలా సరదాగా చూపించడం జరిగింది. అలాగే ప్రేమ కథతో పాటు కుటుంబానికి సంబంధించిన మంచి భావోద్వేగ సన్నివేశాలు కూడా ఉంటాయి. నిజ జీవితంలో ప్రేక్షకులను కనెక్ట్ అయ్యే సీన్స్ ఉంటాయి. అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా ఉంటుంది ఈ సినిమా ఉంటుంది." అని అనుదీప్ తెలిపారు.

రవిబాబు, సురేష్ ప్రొడక్షన్స్ 'రేజర్' షూటింగ్ పూర్తి

తెలుగు సినిమాలో యూనిక్ ఫిల్మ్ మేకర్ గా, నటుడిగా ముద్రవేసిన రవిబాబు ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్ 'రేజర్' తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. తన గత చిత్రం 'ఏనుగుతొండం ఘటికాచలం' వంటి లైట్‌హార్టెడ్ సినిమాకు పూర్తి డిఫరెంట్ గా, ఈసారి టెన్షన్, వైలెన్స్ కూడిన డార్క్ వరల్డ్‌లోకి అడుగుపెడుతున్నారు. ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మక బ్యానర్ సురేష్ ప్రొడక్షన్ స్టార్ ప్రొడ్యూసర్ సురేష్ బాబు ప్రెజెంట్ చేయగా, ఫ్లయింగ్ ఫ్రాగ్స్ నిర్మిస్తోంది. రవిబాబు, సురేష్‌బాబు కాంబినేషన్‌లో మరోసారి వస్తున్న ఈ సినిమా పై ఇప్పటికే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. దర్శకత్వంతో పాటు ఈ చిత్రంలో రవిబాబు హీరోగా కూడా నటిస్తుండటం ప్రత్యేకంగా నిలుస్తోంది. టీం మొత్తం షూట్‌ను పూర్తి చేసింది. ఈ సందర్భంగా ఒక పోస్టర్‌తో పాటు స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. గ్లింప్స్‌లో రవిబాబు వైలెంట్ అవతార్‌లో కనిపించారు. కారు ఇంజిన్ వాల్వ్ కవర్‌తో విలన్‌ను హతమార్చే సన్నివేశం సినిమాకు ఉండబోయే రా అండ్ సావేజ్ టోన్‌ను సూచిస్తోంది. తెలుగు సినిమాల్లో ఇప్పటివరకు చూడని కథాంశంతో 'రేజర్' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించింది. ఈ చిత్రానికి చరణ్ మాధవనేని సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ఎస్ఎస్ రాజేశ్ సంగీతం సమకూరుస్తున్నారు. యాక్షన్ సన్నివేశాలకు సతీష్ పోలోజు కొరియోగ్రఫీ చేస్తున్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200